
BALA CHELIMI

BALA




MAR 2026

MAR

₹40

మార్చి - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 6



MARCH - 2026

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

**Oxford**
**Grammar High School**

KNOWLEDGE IS POWER

OGS JUNIORS — grow naturally —

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



# We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

### CARING TEACHERS & STAFF
Your child will get the best care and attention

### ECO-FRIENDLY PRACTICES
We let the children play with nature friendly material

### HUGE PLAYGROUND
Your child will get lots of fresh air and playtime

### INTERACTIVE LEARNING
Our trusted method helps your child communicate and learn with ease.


**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక



| సంపుటి: Volume: | 35 | సంచిక : Issue : | 6 | హైదరాబాద్ Hyderabad | మార్చ్ March | పేజీలు Pages | 52 | రూ. ₹. | 40 |
|---|---|---|---|---|---|---|---|---|---|





లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| ఆడుతూ, పాడుతూ పరీక్షలు రాయండి | మణికొండ వేదకుమార్ | 5 |
| వైద్యరంగంలో తొలి భారతీయ మహిళ ఆనందీ గోపాల్ జోషి (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| శక్తి నిచ్చే నిద్ర (ప్రపంచ నిద్ర దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| లిల్లీ సింగ్ | షీరోస్-256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| వృథా చేయని వాడే విజేత! (కథ) | మొర్రి గోపి | 11 |
| పేను - నల్లి కథ | పంచతంత్ర కథ | 12 |
| మార్పు మొదలైంది (కథ) | కె.వి.లక్ష్మణ రావు | 13 |
| పులి - జూదం (ఆట) | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారు మర్రి - 10 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| పాంగోలిన్ (న్యూస్) | | 16 |
| దూరపు కొండలు (కథ) | డా. పోతగాని సత్యనారాయణ | 17 |
| కొబ్బరి మిఠాయి (పాట) | గంగదేవు యాదయ్య | 18 |
| మన ఫణిగిరి - చారిత్రక మణిగిరి | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| కొవ్వొత్తి ఎందుకు ఆరిపోయింది? (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| లాజికల్ రీజనింగ్ & ఆల్ఫాబెట్ టెస్ట్ | బాలచెలిమి డెస్క్ | 20 |
| హోలీ ఆడుదాం (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| బాల్య వివాహం (కథ) | యు.సౌమ్య | 23 |
| విద్యుదయస్కాంతత్వానికి వారిద్దరూ రెండు ముఖాలు (సైన్స్ వెన్నెల-17) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| బొప్పాయి చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| మూర్ఖత్వం హానికరం (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| ACC Women's Emerging Teams Asia Cup భారత్‌కు రెండో సారి టీ20 కప్ (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| 'ఓల్డ్ పర్సన్ డే'లో ఆకట్టుకున్న కాత్యాయిని | | 28 |
| అత్యాశ (కథ) | ఎన్. ఝాన్సీ | 29 |
| వేమన పద్యాలు | | 30 |

అన్నా చెల్లెళ్ళు (అనువాద కథ)........................ అనిల్ బత్తుల ........ 31
తెలుగు పండుగలకు ఆది ఉగాది (పండుగ)........................ డా. అమ్మిన శ్రీనివాసరాజు ........ 33
రెండు వేల ఏండ్ల కిందటి భాషా సాహిత్యాలు (చరిత్ర పాఠాలు-13) ........ డా. ద్యావనపల్లి సత్యనారాయణ ........ 35
నేర్చుకుందామా........................ ........ 36
కలం-చెలిమి ........................ ........ 36
అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు (సామెతల కథలు - 2)... ........ బాల కథా సౌరభం ........ 37
111తో అద్భుతం (మాథ్స్ ట్రిక్స్)........................ అంకెల మామయ్య చంద్రయ్య ........ 38
చెలిమి క్లబ్........................ బాలచెలిమి ........ 38
క్లౌడ్ మరియు ఎడ్జ్ కంప్యూటింగ్‌లో AI పాత్ర (విద్య)........................ లత ........ 39
కాకి - గులక రాళ్లు (పిల్లల కథల్లో సైన్స్ -1) ........................ కె శ్రీకృష్ణ సాయి........ 41
సామెతలు ........................ ........ 42
భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు (జి.కె.) ........................ బాలచెలిమి డెస్క్ ........ 43
పాలు పొంగకుండా... (కథ)... ........................ ఆర్.సి.కృష్ణస్వామి రాజు ........ 45
శిలీంధ్రాలు లేకుండా భూమి ఊహించగలమా? ........................ సచిన్ కోత్వాల్ ........ 46
బాలచెలిమి గ్రంథాలయాల ప్రారంభం ........................ బాలచెలిమి డెస్క్ ........ 47
సమాచారం ........................ ........ 49
ఆధునిక భారతీయ తాత్వికుడు, ఆలోచనాపరుడు జిడ్డు కృష్ణమూర్తి (వ్యక్తిత్వం)........ సువేగా ........ 50


# చెలిమి లేఖలు

ప్రియమైన బాలచెలిమి మిత్రులారా,

మీ అందరికీ మా హృదయపూర్వక అభివందనాలు. ఈ నెల బాలచెలిమి సంచికలో విజ్ఞానం, కథలు, కవితలు, పర్యావరణం, ప్రేరణాత్మక వ్యక్తుల పరిచయాలు వంటి ఎన్నో ఆసక్తికర అంశాలను అందిస్తున్నాము. చదువు మాత్రమే కాదు, మంచి విలువలు కూడా మన జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయి.

మీ ఆలోచనలు, కథలు, చిత్రాలు మాకు పంపండి. మీ ప్రతిభకు మా వేదిక ఎప్పుడూ సిద్ధంగా ఉంది.

ప్రేమతో,

**- సంపాదకులు**

చదువు మనకు జ్ఞానం మాత్రమే కాదు, మంచి వ్యక్తిత్వాన్ని కూడా ఇస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం పుస్తకాలకు కేటాయించండి. ప్రశ్నలు అడగండి, తెలుసుకోవాలనే తపన పెంచుకోండి. మీరు ఈరోజు నేర్చుకునే ప్రతి పాఠం రేపటి విజయానికి బాటవేస్తుంది.

**- రాణి,** హైదరాబాద్

అందరికీ నమస్కారం. బాలచెలిమి మాసపత్రిక పిల్లల సృజనాత్మకత, మానసిక వికాసానికి దోహదపడుతోంది. విలువలతో కూడిన కథలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే అంశాలు యువతకు మార్గదర్శకం అవుతున్నాయి. సమాజానికి అవసరమైన విషయాలను అందిస్తున్న సంపాదకులు వేదకుమార్ గారికి నా హృదయపూర్వక నమస్సుమాంజలి.

**- రాధాకృష్ణ,** కరీంనగర్

*Cover Picture*
**KATHYAYINI**
5 Yrs., Class: PPI
School : Siate Felici
Role: Old Women
Occasion: Old Person Day

*బొమ్మలు:*
**కూరెళ్ల శ్రీనివాస్,**
m : 98495 43728





**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# ఆడుతూ, పాడుతూ పరీక్షలు రాయండి...

పిల్లలూ....

పరీక్షలొస్తున్నాయి. పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్నారా! కంగారు పడకండి. మీరు బాగా చదువుతారని తెలుసు. ర్యాంకుల మీద ధ్యాస పెట్టకండి. ఒత్తిడికి గురి కాకండి. బట్టీ పట్టడం వల్ల ఉపయోగం ఉండదు. చెప్పిన పాఠాన్ని సరిగ్గా వినండి. అర్థం చేసుకోవడానికి, అవగాహన పెంపొందించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వండి. ఇష్టమైనదీ, అర్థమయినదీ, అవగాహన అయినదీ ఏదీ ఎప్పటికీ మరిచిపోలేము. ఎంతటి పరీక్షలనైనా సునాయాసంగా రాయగలుగుతారు. చదవాలి అంటే మీరు ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యం అంటే ఏ జబ్బులూ లేకపోవడం కాదు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం. శరీరం దృఢంగా వుండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. మంచి గాలి, వెలుతురు అవసరం. ఒళ్లు అలసిపోయేలా ఆటలు, వ్యాయామాలు తప్పనిసరి. కంటి నిండా నిద్రపోవాలి. పరీక్షల సమయంలో అదనంగా శారీరక, మానసిక విశ్రాంతి అవసరం. ఎక్కువ సేపు గంటల తరబడి ఒకే పుస్తకం చదవకండి. మధ్యలో లేచి అటూ ఇటు తిరగండి. ఇంట్లో వాళ్ళతో కబుర్లు చెప్పండి. పిల్లలుంటే వాళ్లతో ఎంజాయ్ చేయండి. అలాగే ఒక సబ్జక్టును గంటల తరబడి చదవకండి. చిన్న విరామం ఇవ్వండి. మరో పుస్తకం ఏదైనా చదవండి. మార్పు బోర్‌ను పోగొడుతుంది. అలసటను రానివ్వదు. ఆరామ్‌గా చదవండి. అయితే మనసు పెట్టి చదవండి.

ఇతరులతో పోల్చుకోకండి. ఇతరులను మీతో పోల్చకండి. ఇతరులతో పోటీ పడకండి. ఆత్మస్థైర్యంతో మీతో మీరే పోటీ పడండి. మీ శక్తినీ, సామర్థ్యాలను ఉపయోగించడంలో మీరు శ్రద్ధ చూపితే చాలు. విజయాలన్నీ మీవే.

అమ్మలూ... నాన్నలూ... పిల్లలకు పరీక్షలొస్తున్నాయి. వాళ్ళ పరీక్షలను సక్రమంగా, స్వేచ్ఛగా రాయనివ్వండి. ర్యాంకుల పేరుతో ఒత్తిడి పెట్టకండి. ఇతర పిల్లలతో పోల్చి వాళ్లలో ఆత్మన్యూనతాభావాన్ని రానివ్వకండి వాళ్లని భయాందోళనలకు గురి చేయకండి. పరీక్షల సమయంలో పిల్లల ఆరోగ్యం అత్యంత విలువైనది. పోషకాహారంతో, ఆటలతో, విశ్రాంతితో వారు పూర్తి ఆరోగ్యంగా ఉండేటట్లు ప్రయత్నించండి. పరీక్షల సమయంలో మీరు ఎక్కువ సేపు వారితో గడపండి. మంచి మాటలు అంటే సానుకూల, వినోదాత్మక, హుషారునిచ్చే సంభాషణలు జరపండి. వారికి అవసరమైన ప్రశాంత వాతావరణాన్ని ఇంటా బయటా కల్పించండి.

మీ పిల్లలు మంచివాళ్లు, తెలివైన వాళ్లు. బాగా చదువుకుంటున్నారు. విజయాలు సాధిస్తారు. మీరు భయపడకండి. వాళ్ళను భయపెట్టకండి.

మీ

వేదకుమార్. యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





## వైద్యరంగంలో తొలి భారతీయ మహిళ

# ఆనందీ గోపాల్ జోషి

ఆనందీ గోపాల్ జోషి పాశ్చాత్య వైద్య విద్యలో పట్టభద్రురాలైన తొలి భారతీయ మహిళగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. మహిళలు చదువుకోవడమే కష్టసాధ్యమైన కాలంలో, విదేశాలకు వెళ్లి వైద్యశాస్త్రంలో డాక్టరేట్ సాధించడం ఆమె అసాధారణ ధైర్యం, పట్టుదల, సంకల్పానికి నిదర్శనం. భారతదేశంలో మహిళలకు వైద్య సేవలు అందించాలనే తపనతో ఆమె చేసిన ప్రయాణం స్ఫూర్తిదాయకం.

మహారాష్ట్రలోని పూణేలో ఒక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో 1865 మార్చి 31న ఆమె జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు యమున. చిన్న వయస్సులోనే గోపాలరావు జోషిని వివాహం చేసుకున్నారు. వివాహానంతరం ఆమెకు "ఆనందీబాయి" అనే పేరు పెట్టారు. గోపాలరావు ప్రగతిశీల ఆలోచనలు కలిగిన వ్యక్తి. మహిళా విద్యకు ఆయన మద్దతు ఇచ్చి, ఆనందీబాయికి ఆంగ్ల భాష నేర్పించారు. విద్యపై ఆమె ఆసక్తిని ప్రోత్సహించారు.



14 ఏళ్ల వయస్సులో ఆనందీబాయి ఒక శిశువుకు జన్మనిచ్చారు. సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల ఆ శిశువు పది రోజుల్లోనే మరణించాడు. ఈ విషాదం ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. భారతదేశంలో మహిళలకు సరైన వైద్యసేవలు అందుబాటులో లేవని గ్రహించిన ఆమె వైద్యురాలిగా మారాలని సంకల్పించారు. భర్త ప్రోత్సాహంతో ఆమె అమెరికాలో వైద్యవిద్య అభ్యసించేందుకు సిద్ధం అయ్యారు. ఆ కాలంలో విదేశాలకు వెళ్లడం సామాజికంగా వ్యతిరేకతను రేకెత్తించే విషయం. అయినప్పటికీ అనేక విమర్శలు, అవమానాలను అధిగమించి 1883లో ఆమె అమెరికా వెళ్ళారు. అక్కడ థియోడిసియా కార్పెంటర్ అనే మహిళ ఆమెకు సహాయం చేశారు.

ఆనందీబాయి ఫిలడెల్ఫియాలోని Womanμs Medical College of Pennsylvania లో చేరి వైద్య విద్యను అభ్యసించారు. తీవ్రమైన చలి, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆమె తన లక్ష్యాన్ని వదులుకోలేదు. కేవలం 19 ఏళ్ల వయస్సులో వైద్య విద్యను ప్రారంభించి, 1886 మార్చి 11న డాక్టరేట్ పొందారు. ఆమె పరిశోధనాంశం "ఆర్య హిందువులలో ప్రసూతి మరియు శిశు వైద్యం."

ఆమె పట్టాభద్రత సందర్భంగా బ్రిటన్ మహారాణి Queen Victoria శుభాకాంక్షలు పంపారు. అదే సమయంలో కాదంబిని గంగూలీ కూడా వైద్య పట్టా పొందడం భారత మహిళా వైద్య విద్యా చరిత్రలో ముఖ్య ఘట్టం. అయితే ఆనందీబాయి ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. క్షయవ్యాధితో బాధపడుతూ 1886లో భారతదేశానికి తిరిగి వచ్చారు. కొల్హాపూర్ సంస్థానంలోని ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిగా నియమితులు అయ్యారు. కేవలం 22 ఏళ్ల వయస్సు లోనే, 1887 ఫిబ్రవరి 26న ఆమె తుది శ్వాస విడిచారు. ఆమె మరణం దేశ వ్యాప్తంగా విషాదాన్ని నింపింది.

ఆనందీబాయి జోషి పేరు మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచింది. 2018లో ఆమె జన్మదిన సందర్భంగా Google ప్రత్యేక డూడుల్ విడుదల చేసి ఆమెకు గౌరవం తెలిపింది.

ఆమె జీవితం మనకు ఒక గొప్ప సందేశం ఇస్తుంది – పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, సంకల్పం మరియు ధైర్యం ఉంటే అసాధ్యమనే దానిని సైతం సాధ్యంగా మార్చుకోవచ్చు. భారతీయ మహిళలకు వైద్యరంగంలో మార్గం చూపిన ఈ మహనీయురాలు చరిత్రలో చిరస్మరణీయురాలు.

*(మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ ప్రత్యేకం)*

– జుగాష్విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998




# శక్తి నిచ్చే నిద్ర

హాయ్ శిరీషా! చాలా డల్‌గా కనిపిస్తున్నావేంటి?. "నిన్న రాత్రి శివరాత్రి జాగారం చేసాను. అంటే.. అదే నేను రోజూ రాత్రి 9 గంటలకి పడుకుంటాను. కాని నిన్న శివరాత్రి అని మా చిన్నమ్మ వస్తే అందరం ముచ్చట్లు చెప్పుకుంటూ, అంత్యాక్షరి ఆడుకుంటూ, ఆలస్యంగా పడుకున్నాను. ఉదయం నుండి తలనొప్పి, కళ్లు మంటలు" అంటూ శిరీష నీరసంగా చెప్పింది. వాళ్ల మాటలు విన్న సైన్స్ టీచర్ ఈరోజు క్లాస్‌లో నిద్ర గురించి కొన్ని వాస్తవాలు చెప్పాలనుకుంది. ఆరోగ్యానికి ఆహారం ఎంత ముఖ్యమో సరైన సమయంలో తగినంత నిద్రకూడా అంతే అవసరం. ఆరోగ్య నిపుణులు, మేధావులు నిద్ర మనిషి శరీరానికి ఎంత అవసరమో తెలియజేయడానికి ఒక రోజును కేటాయించారు. 2008వ సంవత్సరం నుండి వర్ల్డ్ స్లీప్ సొసైటీ (world sleep society) ప్రతి సంవత్సరం మార్చి నెల మూడవ శుక్రవారాన్ని ప్రపంచ నిద్ర దినోత్సవం (world sleep day) పేరుతో, ఆరోగ్యం పై నిద్ర యొక్క ప్రత్యక్ష ప్రభావాన్ని, మంచి నిద్ర అలవాట్లను ప్రజలకు తెలియజేస్తున్నారు. World sleep day లో ప్రపంచంలోని శాస్త్రవేత్తలు, డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య విద్యార్థులు, పరిశోధకులు పాల్గొంటారు. వారు ప్రజల మానసిక, శారీరిక ఆరోగ్యంపై నిద్ర యొక్క పాత్ర గురించి చర్చిస్తారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో ఈ ఉత్సవాన్ని జరుపుతారు. 2026 సంవత్సరానికి 'sleep well, live better' అనే థీమ్‌ను తీసుకున్నారు. దీనిపై వైద్యులు, పరిశోధక విద్యార్థులు పత్ర సమర్పణ చేస్తారు. ప్రజలలో మంచి నిద్ర, ఆరోగ్యకరమైన జీవనానికి ఎలా తోడ్పడుతుందో తెలియ జేస్తారు.

Sleep is the best meditation. - Dalai Lama.

ఈ మధ్య కాలంలో చిన్న, పెద్ద తేడా లేకుండా అనేక మందిని వేధిస్తున్న సమస్య నిద్రలేమి. ముఖ్యంగా చదువుకునే పిల్లలలో 'స్మార్ట్ ఫోన్ల' వినియోగం అనేది నిద్ర సమస్యలకి కారణమవుతోంది.

మంచి నిద్రకు 'మెలటోనిన్' అనే హార్మోన్ సహాయ పడుతుంది. ఇది రాత్రి సమయంలోనే విడుదల అవుతుంది. దీనిని 'గ్రోత్ హార్మోన్' అని కూడా అంటారు. ఇది పిల్లల కండరాల, మానసిక పెరుగుదలకు చాలా ముఖ్యం. చదువుకునే పిల్లలకి కనీసం తొమ్మిది గంటల నిద్ర అవసరం.

మంచి గాఢ నిద్ర తోనే గ్రోత్ హార్మోన్ విడుదల అవుతుంది. అది పిల్లల జ్ఞాపకశక్తికి, రోగనిరోధక శక్తికి సహాయ పడుతుంది. కణజాలాలను మరమ్మతు చేస్తుంది. ఆకలిని నియంత్రిస్తుంది. హార్మోన్లను స్థిరీకరిస్తుంది. అప్పుడే పిల్లల మెదడు యాక్టివ్‌గా ఉంటుంది. కొత్త విషయాలను నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. ప్రతి ఒక్కరికి నిద్ర పోవడానికి, నిద్ర లేవడానికి ఒక ప్రత్యేక సమయం ఉంటుంది. అది వారి జీవగడియారంతో ముడిపడి ఉంటుంది. దానినే 'సర్కాడియన్ రిథమ్' అంటారు. ఈతరం పిల్లలకి కావలసినంత నిద్ర లేకపోవటంతో, నిరాశ, కుంగుబాటుకు లోనవుతున్నారని 'వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ స్లీప్ మెడిసిన్' పరిశోధన ఫలితాలు తెలియ జేస్తున్నాయి. ఇటీవలి కాలంలో పిల్లలలో నిద్రపోయే సమయం తగ్గిపోవడం అనేక కొత్త సమస్యలకి దారి తీస్తోంది. వాటిలో ముఖ్యమైనది ఊబకాయం. దానితో పాటు చిన్నతనంలోనే బి.పి, షుగర్, గుండె సమస్యల లాంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తోంది.

మంచినిద్రకు కొన్ని చిట్కాలను తెలుసుకుందాం.

- ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవాలి. ఒకే సమయానికి లేవాలి.
- రాత్రి పూట తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.
- జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, మసాలా వంటలు, టీ, చాక్లెట్‌లను తగ్గించుకోవాలి.
- సరైన మోతాదులో నీళ్లు తాగాలి.
- రోజూ అరగంటైనా వ్యాయామం చేయాలి.
- కనీసం తొమ్మిది గంటలు నిద్రపోయేట్లు చూసుకోవాలి.
- నిద్రపోయే గదిలో తక్కువ వెలుతురు ఉండేట్లు చూసుకోవాలి.
- పడుకునే గంట ముందైనా స్క్రీన్‌కి దూరంగా ఉండాలి.
- పిల్లలూ నిద్రకి కూడా ఒక క్రమశిక్షణ అవసరం. చదువుకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో, నిద్రకి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి.

"Early to bed and early to rise makes a man healthy, wealthy and wise",

– డా. నీరజ అమరవాది
m : 9849160055

**FORM IV** (See Rule 8)

Statement about ownership and other particulars of periodical BALA CHELIMI as required to be published in the first issue every year after the last day of February.

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Hyderabad |
| 2. Periodicity of its publication | : | Monthly |
| 3. Printer's Name | : | M.Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 4. Publisher's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 5. Editor's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 6. Names and addresses of individuals who own the periodical and partners or shareholders holding More than one per cent of the total capital. | : | M. Veda Kumar |


I, M. Veda Kumar, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(M. Veda Kumar)

Date : 1st March, 2026 Signature of Publisher

# లిల్లీ సింగ్

## యూట్యూబ్ తార – మంచిని పంచే ప్రపంచ రాయబారి






లిల్లీ సైనీ సింగ్ (1988 సెప్టెంబర్ 26 –) భారత – కెనడియన్ కంటెంట్ సృష్టికర్త, టెలివిజన్ రంగంలో ప్రసిద్ధురాలు, కమెడియన్, రచయిత్రి, నటి.

2010లో 'సూపర్ ఉమన్' అనే మారుపేరుతో తన యూట్యూబ్ ప్రయాణాన్ని ఆమె ప్రారంభించారు. ఆ తరవాత అంతర్జాల ప్రపంచంలో ప్రముఖ వ్యక్తిగా మారారు. ఆమె వీడియోలు తరచుగా పంజాబీ సాంస్కృతిక విషయాలు తెలియచేస్తాయి. సాధారణ అంశాల నుంచి ముఖ్యమైన సామాజిక సమస్యల వరకు వ్యంగ్యాత్మక వీడియోలను ఆమె రూపొందించారు.

అనేక టెలివిజన్, యూట్యూబ్ ఛానెళ్లలో లిల్లీ సింగ్ పని చేశారు. తన హాస్యంతో అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందారు, ప్రముఖ ఎంటర్‌టైనర్‌గా స్థిరపడ్డారు. బాలల హక్కుల కోసం పని చేయడానికి 2017లో యునిసెఫ్ ఆమెను గుడ్విల్ అంబాసడర్‌గా ప్రకటించింది. అమ్మాయిలను అమ్మాయిలు వేధించడాన్ని అంతం చేయడానికి 'గర్ల్‌లవ్' పేరుతో సాగిన ప్రచార కార్యక్రమానికి ఆమె నాయకత్వం వహించారు.

ఒకరిని అనుకరించడం కాకుండా స్వయంకృషితో తమను తాము రుజువు చేసుకుని కూడా గొప్ప స్థానాన్ని చేరుకోవచ్చని ఆమె విజయగాథ నిరూపిస్తుంది.

– 'షీరోస్–256

ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?


2017లో విడుదలైన ఆమె మొదటి పుస్తకం 'హౌ టు బి ఎ బౌస్ : ఎ గైడ్ టు కాంకరింగ్ లైఫ్' న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్



# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం



'లంక రాజు రావణుడని తెలుసా?
'లంబాడీల లడి నృత్యం చూశారా?
లగ్గంలో లడ్డూల భోజనం తిన్నారా?
'లవంగం"లో ముందర అక్షరమేది? "ల" అక్షరం



వంద వందనాలు గురువు గారికి
వధూవరులకు వంకాయ కూర నచ్చింది
వనములో ఏ ఏ జంతువులుంటాయి?
"వల" లో మొదటి అక్షరమేది? "వ" అక్షరం



శంకరునికి శర్కర నైవేద్యం చూపాలి
శరీరం వణికేట్లు శంఖం ఊదాలి
శరం వాలిపై వేసిన దెవరు?
"శనగకాయ"లో ముందు ఏ అక్షరముంది? "శ" అక్షరం



'షండము' అంటే ఆంబోతు అని తెలుసా?
'షష్టి' అంటే అరువది అని తెలుసా?
'షట్పదము' అంటే తుమ్మెద అని తెలుసా?
'షట్కము'లో మొదటి అక్షరం? "ష" అక్షరం



సగము సగము ఒకటవుతుంది
సంకల సంటిది నవ్వుతున్నది
'సమత' అంటే సమమని తెలుసా?
"సరళ"లో మొదటి అక్షరమేది? "స" అక్షరం

- డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

కథ

# వృథా చేయని వాడే విజేత!



మూడో తరగతి చదువుతున్న చిట్టిబాబు చాలా తెలివైన పిల్లవాడు. చదువులో చురుగ్గా ఉన్నా, అల్లరిలోనూ వాడే ముందుండేవాడు. క్లాసులో నిశ్శబ్దంగా ఉండటం అతనికి అస్సలు నచ్చేది కాదు. ఉపాధ్యాయులు ఎన్నిసార్లు మందలించినా, తల్లి విజయమ్మ ఎంత నచ్చజెప్పినా చిట్టిబాబు తీరు మారలేదు.

కేవలం పాఠశాలలోనే కాదు, ఇంట్లో కూడా చిట్టిబాబు చేసే పనులు అందరికీ ఇబ్బంది కలిగించేవి. ముఖ్యంగా నీటిని, విద్యుత్తును వృథా చేయడం అతనికి ఒక అలవాటుగా మారింది. స్నానాల గదికి వెళ్తే పంపు కట్టకుండానే వచ్చేసేవాడు. "అమ్మా! మోటార్ వేస్తే ట్యాంక్ నిండిపోతుంది కదా! నీరు పోతే నీకేం నష్టం?" అని ఎదురు ప్రశ్నించేవాడు. పగలు కూడా గదిలో లైట్లు వేసి ఉంచేవాడు. "పెద్దల మాట చద్ది మూట" అన్న నానుడి అతనికి అస్సలు పట్టేది కాదు. వేసవికాలంలో ఇంటిముందు వాలే పక్షుల కోసం తల్లి విజయమ్మ కప్పులో నీళ్లు పెడితే ఆ నీళ్లను కూడా ఆకతాయిగా పడేసేవాడు. తల్లి కోప్పడినా పట్టించుకునేవాడు కాదు.

ఒక వేసవి కాలం సాయంత్రం, చిట్టిబాబు బడి నుంచి ఇంటికి వచ్చాడు. రోజంతా ఆడుకోవడం వల్ల ఒళ్లంతా మట్టితో నిండిపోయింది. త్వరగా స్నానం చేసి శుభ్ర పడదామని బాత్రూమ్‌లోకి వెళ్లి పంపు తిప్పాడు. కానీ, చుక్క నీరు కూడా రాలేదు.

"అమ్మా! పంపులో నీళ్లు రావట్లేదు, త్వరగా మోటార్ వెయ్యి!" అంటూ గట్టిగా అరిచాడు.

విజయమ్మ నెమ్మదిగా వచ్చి, "నాయనా! ఉదయం నువ్వు నీటి పంపు కట్టకుండా వదిలేశావు. దానివల్ల ట్యాంకులో నీరంతా అయిపోయింది. ఇప్పుడు చూస్తే కరెంటు లేదు. వేసవి కాబట్టి కోతలు విధిస్తున్నారు. కరెంటు వచ్చే వరకు మోటార్ వేయడం కుదరదు" అని చెప్పింది.

నీళ్లు లేక చిట్టిబాబుకు ఒళ్లంతా నరకప్రాయంగా అనిపించింది. దానికి తోడు విపరీతమైన దాహం వేసింది. ఇంట్లో తాగడానికి కూడా నీళ్లు లేవని తల్లి చెప్పేసరికి చిట్టిబాబుకు తన తప్పు అర్థమైంది. విజయమ్మ పక్కింటికి వెళ్లి ఒక గ్లాసు నీళ్లు తెచ్చి ఇచ్చింది. ఆ ఒక్క గ్లాసు నీటి విలువ అప్పుడు అతనికి తెలిసొచ్చింది.

విజయమ్మ చిట్టిబాబును దగ్గరకు తీసుకుని ఇలా చెప్పింది: "చూశావా చిట్టిబాబూ! ప్రకృతి ప్రసాదించిన నీరు, విద్యుత్తు చాలా విలువైనవి. నువ్వు చేసిన చిన్న తప్పు వల్ల ఈరోజు ఇంట్లో తాతయ్య, నాన్నమ్మ అందరూ ఇబ్బంది పడ్డారు. పెద్దలు, గురువులు నీ మంచి కోసమే చెబుతారు. క్రమశిక్షణ లేని చదువు వెల లేని నగ వంటిది. వృథా చేయనివాడే అసలైన విజేతగా ఎప్పుడూ నిలుస్తాడు" అని చెప్పింది.

తల్లి మాటలు చిట్టిబాబు మనసును తాకాయి. తన అల్లరి వల్ల, అజాగ్రత్త వల్ల ఇతరులు పడుతున్న ఇబ్బందిని కళ్లారా చూశాడు.

“అమ్మా! నన్ను క్షమించు. ఇకపై నీటిని కానీ, విద్యుత్తును కానీ వృథా చేయను. బడిలో కూడా అల్లరి మానేసి, క్రమశిక్షణతో చదువుకుని ఉపాధ్యాయుల మెప్పు పొందుతాను” అని మాట ఇచ్చాడు.

అప్పటి నుండి చిట్టిబాబు ప్రవర్తనలో ఊహించని మార్పు వచ్చింది. అతను క్లాసులో అందరికంటే క్రమశిక్షణ గల విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. చిట్టిబాబులో వచ్చిన ఈ మార్పు చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎంతో మురిసిపోయారు.

***నీతి: వనరులను వృథా చేయడం అంటే మన భవిష్యత్తును మనం నాశనం చేసుకోవడమే. క్రమశిక్షణే మనిషికి నిజమైన అలంకారం.***

– మొర్రి గోపి
m : 8897882202

పంచతంత్ర కథలు

# పేను – నల్లి కథ



మందవిసర్పిణి అనే ఒక పేను ఉండేది. అది చాలా కాలంగా ఒక రాజుగారి హంసతూలికాతల్పాన్ని అంటిపెట్టుకుని, రాజుగారిని కుట్టి రక్తం త్రాగుతూ సుఖంగా జీవిస్తోంది. నెమ్మదిగా ప్రాకుతుంది గనుక మదవిసర్పిణి అని దానికి పేరు. అయితే ఏమాత్రం నొప్పి కలగనివ్వదు గనుక దానివల్ల రాజుగారికి ఏ బాధా లేదు.

అయితే ఒకనాడు ఒక నల్లి వచ్చి ఆ పేనుని ఆశ్రయం ఇమ్మంది. ప్రతిరోజూ పంచభక్ష్య పరమాన్నాలు భోజనం చేసే రాజుగారి రక్తం చాలా బాగుంటుందని, దాన్ని ఒక్కసారి రుచి చూసి వెళ్ళిపోతానని ఆ నల్లి పేనుని వేడుకుంది. మొహమాటంకొద్దీ ఆ పేను సరేనని ఒప్పుకుంది. అయితే, “రాజుగారికి నిద్రపట్టేవరకూ ఆగి, మెల్లిగా నొప్పి పెట్టకుండా పని కానియ్యి” అంటూ క్రొత్తగా వచ్చిన ఆ నల్లికి పేను ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. కానీ, రాజుగారు వచ్చి మంచం మీద నడుం వాల్చారో లేదో నల్లి ఆత్రంగా పుటుక్కున పొడిచి రక్తం జుర్రుకుంది. ఆ బాధకు తట్టుకోలేక రాజు సేవకుణ్ణి పిలిచాడు. సేవకుడు దీపం తెచ్చి పట్టెమంచం, పరుపు అంతా గాలించాడు. ఈలోగా నల్లి పరుగెత్తి పారిపోయి పట్టెసందులో నక్కింది. ఏమీ తెలియని పేను దుప్పటిని అంటిపెట్టుకుని సేవకుడి కంటబడింది. అదే రాజును కుట్టిందనుకుని సేవకుడు ఆ పేనును పట్టుకుని నేలరాచి చంపేశాడు.

**నీతి : గుణము, శీలము తెలియకుండా ఎవ్వరినీ చేరదీయరాదు.**

సేకరణ : అమరావతి

కథ

# మార్పు మొదలైంది



జీవన్ ఆరవ తరగతి చదువుతున్నాడు. చురుకైనవాడు. తెలివైనవాడు. కానీ బద్ధకం ఎక్కువ. ప్రతి రోజూ బడి నుండి ఇంటికి వచ్చాకా, నాన్న రాఘవ జీవన్‌తో 'వర్క్ చేయ'మని చెబితే "రేపు చేస్తానులే" అంటూ బద్ధకంతో చదువును వాయిదా వేస్తాడు.

ఒకరోజు బడినుండి ఇంటికి వచ్చాడు. రాఘవ, జీవన్ డైరీ చూసారు. "న్యూటన్ మొదటి నియమం" చదివి రాయాలని ఉంది.

"జీవన్! న్యూటన్ మొదటి నియమాన్ని చదవమంటూ రాఘవ పిలిచాడు.

"రేపు ఆదివారం కదా. తర్వాత రాస్తాలే" అంటూ తన అలవాటులో భాగంగా చదువును వాయిదా వేశాడు.

తెల్లారింది. వర్క్ విషయం పక్కన పెట్టి, నాన్నతో కలిసి, తాతయ్య ఇంటికి బస్సులో బయలుదేరాడు. బస్సులో కిటికీ పక్కన కూర్చున్నాడు. వేగంగా దూసుకుపోతున్న బస్సులో నుండి, బయట కదులుతున్నట్లనిపిస్తున్న చెట్లను చూసి మురిసిపోయాడు.

అంతలోనే డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. జీవన్‌కు, తన శరీరం అదుపు తప్పి విసిరినట్లనిపించింది. ముందుకు తడబడినా పడిపోకుండా తన ముందుసీటు పైనున్న ఊచను గట్టిగా పట్టుకున్నాడు. "ఏమైంది, నాన్నా?" అడిగాడు.

"న్యూటన్ మొదటి నియమం అంటే ఇదే జీవన్" నాన్న నవ్వుతూ అన్నాడు. "అంటే?" అడిగాడు.

"బస్సు కదులుతున్నంత సేపూ, నువ్వూ గమనంలో ఉన్నావు కనుక ముందుకు పడలేదు. కానీ బస్సు ఒక్కసారిగా ఆగే సరికి, నువ్వూ ఆగలేక అమాంతం ముందుకు కదిలావ్.

"బాహ్య బలం ప్రభావం లేనంత వరకూ గమనంలో ఉన్న వస్తువు గమనం లోనూ, నిశ్చలంగా ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటాయి. మార్పును స్వాగతించవు. ఇదే జడత్వం. అంటే బద్ధకం అన్నమాట.

నాన్న మాటలు అనుభవ పూర్వకంగా అర్థం కావడంతో "నిజమే! నాన్నా! నువ్వు చెప్పినట్లే ముందుకు తడబడ్డాను" చెప్పాడు జీవన్.

"నిన్నే తీసుకో. తెలివి తేటలున్నా చదువును బద్ధకంతో వాయిదా వేస్తున్నావ్. బ్రేకు వేస్తే ఒక్కసారిగా ముందుకు పడినట్లుగా పరీక్షలు వస్తే రాయలేక తడబడుతున్నావ్. జడత్వాన్ని అనగా నీ బద్ధకాన్ని జయిస్తే విజయం నీదే. 'రేపు' అంటే 'లేదు'కు పర్యాయ పదం. బద్ధకమే శత్రువని గమనించు." నాన్న మాటలతో జీవన్‌లో ఆలోచన మొదలైంది.

"నాన్నా! నువ్వు చెప్పడం చేత బద్ధకం ఎంత తప్పో తెలిసింది.. రాబోయే ఫిబ్రవరి 28 సర్ సి.వి.రామన్ గారి పుట్టినరోజు. సైన్స్ దినోత్సవం సందర్భంగా, మా బడిలో సైన్స్ ఫెయిర్ పెడతారు.. నువ్వు సాయం చేస్తానంటే నేను సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటాను. సైన్స్ ప్రయోగం తయారు చేస్తాను. సరేనా, నాన్నా" అన్నాడు హుషారుగా.


అప్పుడే బస్సు ముందుకు బయలుదేరింది. ఈ సారి జీవన్ ముందుకు పడలేదు.

అది గమనించిన రాఘవ, "జీవన్, నువ్వు మారావ్. బస్సు కదిలినా తడబడకుండా, ముందుకు పడకపోవడమే అందుకు నిదర్శనం. సైన్స్ ఫెయిర్‌లో నువ్వు పాల్గొంటావ్. ఖచ్చితంగా విజయం సాధిస్తావు జీవన్ భుజాన్ని తడుతూ అన్నాడు. "థాంక్స్ నాన్నా" హుషారుగా అన్నాడు జీవన్.

- కె.వి.లక్ష్మణ రావు
9014659041

ఆట

# పులి - జూదం



**ఎంత మంది పాల్గొనవచ్చు - ఇద్దరు**
**ఎక్కడ ఆడవచ్చు - ఇంటి లోపల లేదా బయట**
**ఈ ఆటకు గల ఇతర పేర్లు -**
**పుంజీతము, పులిమేక ఆట**

పులి-మేక ఇది పట్టికతో ఆడే ఆట. ఈ ఆటను ఇద్దరు ఆటగాళ్ళు ఒకరు మూడు పులులతో మరొకరు 15 మేకలతో ఆడవలసి వుంటుంది. పులులు మేకలను వేటాడితే, మేకలు పులులను కట్టడి చేయవలసి వుంటుంది.

### ఆడవలసిన విధానం :

- ఈ ప్రక్కన ఉన్న చిత్రంలో చూపినట్టుగా పట్టికను నేలమీద కాని అట్ట మీద కాని గీయాలి.
- ఒక పులిని కొండపైన మిగిలిన రెండు పులులను కొండకు దగ్గరగా ఉన్నటువంటి × (రెండు గీతలు కలిసే చోట) లో పెట్టి ఆటను మొదలు పెట్టాలి.
- మేకలతో ఆడే ఆటగాడు మొదట మేకను పట్టికలోని ఖాళీగా ఉన్నటువంటి × లో పెట్టాలి.
- తరువాత పులులతో ఆడే ఆటగాడు తన పులులలో ఒకదానిని పక్కనే ఉన్నటువంటి ఏదైనా ఖాళీగా ఉన్న × లోకి జరపాలి. ఇలా ఒకరి తరువాత ఒకరు పావులను జరుపుకుంటూ ఆటను కొనసాగించాలి.
- ఐతే పులి ప్రక్కన మేక, దాని ప్రక్కన ఖాళీ × ఉంటే పులి ఆ మేకను చంపుతుంది. ఇలా చంపబడిన మేకను పట్టికపై నుంచి తీసి వేయాలి. 15 మేకలు అట్టపైకి చేరేంతవరకు, వాటిని జరుపకూడదు.

### రూల్స్ (పులులు) :

- పులులు ఆట మొదలైన దగ్గర నుంచి ఎపుడైనా సరే మేకలను మింగవచ్చు. ఒక్కొక్కసారి ఒకే మేకను మింగవలసి వుంటుంది.
- పులి మేకపై ఎటువైపు నుంచైనా దూకవచ్చు. ఐతే ఖాళీగా ఉండే × అదే గీతలో ఉండాలి.
- ఒక పులి ఇంకొక పులి మీద నుంచి దూకకూడదు.

### రూల్స్ (మేకలు) :

- పులి మింగినపుడు ఆ మేకను పట్టిక నుంచి తీసి వేయాలి. మేకలు పులులపై నుంచి గాని మరి ఏ ఇతర మేకలపై నుండి గాని దూకరాదు.
- 15 మేకలూ పట్టిక మీదకు వచ్చిన తరువాతనే మేకలను జరుప వలసి వుంటుంది.

### గెలుపు :

- పులులు అన్ని మేకలను చంపగలిగితే పులులు గెలిచినట్లు.
- మేకలు పులులను కదలకుండా కట్టడి చేయగలిగితే మేకలు గెలిచినట్లు.

### ప్రయోజనం :

- ఈ ఆట ఆడటం ద్వారా వ్యూహం పన్నడం తెలుస్తుంది.

– 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...

సీరియల్-10

(గత సంచిక తరువాయి...)




(బాలలకోసం ఆధునిక సాహస నవల)

# బంగారు మర్రి

ఫారెస్ట్ రేంజ్ అఫీసర్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. పులి అడవి దాటి గూడెం వైపు వెళ్లిందంటే దానికి అడవిలో కావలసిన సౌకర్యాలు లేవని స్పష్టమైంది. తాగటానికి నీరు, తినటానికి తిండి ఉంటే పులులు అడవి దాటి బయటికి రావు.

“డియర్ కొలీగ్స్! ఒక్క పులి వంద మంది ఫారెస్ట్ ఆఫీసర్లతో సమానమని నేను మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

పులి అడవిలో లేకుంటే పర్యావరణం దెబ్బతింటుంది. వన్య ప్రాణులకు తాగు నీరు దొరక్కపోతే రాళ్లు నాకడం, చెట్ల కొమ్మలు, బెరడు నాకడం చేస్తాయి. దాంతో.. వాటి నోటికి ముళ్లు గుచ్చుకుంటాయి. నాలుక, నోటి భాగాలు

చీలి గాయపడి అనారోగ్యానికి గురవుతాయి. వీటి నివారణకు ఉప్పుగడ్డలు ఏర్పాటు చేయండి.

మంచినీటి కోసం ట్యాంకర్లు తెప్పించి సాసర్ పిట్స్‌లలో నింపించండి.

నీటి కుంటలు, చెలమల్లో పూడికలు తీయించండి. పులికి ఇష్టమైన ఆహారం జింకలు. ఇతర అడవుల నుంచి జింకలు తెప్పించి ఈ అడవిలో వదలండి.

వెంటనే పులులపెంట చుట్టూత సి.సి. కెమేరాలు ఏర్పాటు చేయండి" అంటూ కింది అధికారులకు ఆదేశాలు అందించాడు.

అటవీ సిబ్బంది పులికి ఆహారమైన జింకలు, అడవి పందులు, దూడలు తెప్పించారు వాటిని అడవిలో వదిలేశారు. అడవిలో అనేక ప్రదేశాల్లో సాసర్లు ఏర్పాటు చేసి నీటిని నిలువ చేశారు అడవిలో తిరిగే టైగర్ ట్రాకర్లను కూడా అప్రమత్తం చేశారు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సెల్‌ఫోన్ నెంబర్ కూడా అడవి చుట్టూతా ఉన్న గ్రామాల్లో గోడల మీద రాయించి పులి కనిపించినా, వేటగాళ్లు కదలికలు గమనించినా వెంటనే ఆ నెంబర్‌కు సమాచారం అందించ వలసిందిగా తెలియజేశారు. పెట్రోలింగ్ కూడా మొదలు పెట్టారు. రాత్రిపూట కూడా కొందరు టైగర్ ట్రాకర్స్ ని గస్తీ తిరిగేలా ఏర్పాటు చేశారు.

ఉదయం 4:30 గంటల సమయం పక్షులు పెద్దగా అరుస్తున్నాయి. పులిపెంటలో కావలి కాసే కుక్కలు అరుపులు వినిపించాయి. ఆకస్మికంగా పులి పెంటలోని ఓ ఇంటి ఆవరణలో కట్టివేసి ఉన్న లేక దూడను అమాంతం దాడి చేసి పొదల్లోకి లాక్కుపోయింది. పులిపెంట నిద్ర మేల్కొంది. పులి లేగ దూడని ఎత్తు కెళ్లిన విషయం చుట్టుపక్కల గూడేలకు కూడా తెలిసిపోయింది. పులి తిరుగుతుందని సమాచారంతో తమ పశువులను జాగ్రత్త పరిచారు. కాట్రాజు పులిపెంటలో పులి తిరుగుతున్న సమాచారం అటవీ అధికారులకు అందజేశాడు. పులి కదలికలు సీ.సీ కెమెరాల ద్వారా అధికారులు పరిశీలించారు. పులి గూడెం దాటి నగరం వైపు పరుగులు తీయటం గమనించారు. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ

m : 9247564699

అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంఘం International Union for Conservation of Nature (IUCN) నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అనేక జంతు, పక్షి జాతులు అంతరించిపోతున్నాయని హెచ్చరికలు వెలువడ్డాయి. ఇందులో పాంగోలిన్ కూడా ఉంది.

ఈశాన్య భారతదేశంలో పాంగోలిన్ సంరక్షణకు కీలకంగా, సంగ్తం నాగ సమాజ అగ్ర గిరిజన సంస్థ United Sangtam Likhum Pumji తమ పరిధిలో వేటపై పూర్తి నిషేధం విధించింది. 2023లో Wildlife Trust of India మణిపూర్‌లో అక్రమ వన్యప్రాణి వ్యాపారాన్ని అరికట్టేందుకు ప్రాజెక్ట్ ప్రారంభించి, భారతీయ పాంగోలిన్ (Manis crassicaudata) మరియు చైనీస్ పాంగోలిన్ (Manis pentadactyla) రక్షణకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే Tangkhul Naga Awunga Long కూడా ఇలాంటి నిషేధ తీర్మానం చేసి సముదాయ ఆధారిత సంరక్షణకు బలాన్నిచ్చింది.




అక్టోబర్ 2025లో బాలచెలిమి మాసపత్రికలో ప్రచురితమైన పాంగోలిన్ వ్యాసం. భారతదేశంలో ప్రమాదకర స్థాయిలో ఉన్న పాంగోలిన్ వంటి అరుదైన జంతువుల పరిస్థితిని స్పష్టంగా వివరిస్తూ, ప్రకృతి సంరక్షణపై సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుంది. ఈ నేపథ్యంలో బాలచెలిమి మాస పత్రికలో "ప్రపంచంలో అంతరించి పోతున్న పక్షులు, జంతువులు" అనే శీర్షికతో ప్రచురిస్తున్న వ్యాసాలు పర్యావరణ అవగాహనకు దోహదం చేస్తాయి.



# దూరపు కొండలు

ఒక సాయంత్రం వేళ ఆకాశం ఎర్రగా మెరుస్తోంది. అరుగు మీద కూర్చున్న అభయ్, దూరంగా కనిపిస్తున్న నీలిరంగు కొండలను చూస్తూ మురిసిపోయాడు. "తాతయ్యా! ఆ కొండలు చూడు.. ఎవరో నునుపుగా పాలిష్ చేసినట్లు ఎంత మెత్తగా ఉన్నాయో! మన ఊరిలో ఉన్న ఈ రాతి గుట్టల కంటే అవి చాలా బాగున్నాయి. మనం అక్కడికి వెళ్లి ఆడుకుందామా?" అని అడిగాడు. తాతయ్య నవ్వి, అభయ్‌ని దగ్గరకు తీసుకున్నాడు. "అభయ్! మన పెద్దలు అప్పుడప్పుడు 'దూరపు కొండలు నునుపు' అనే జాతీయాన్ని ఉపయోగిస్తుంటారు కదా!. అంటే దూరం నుండి చూసినప్పుడు అన్నీ అందంగానే కనిపిస్తాయి, కానీ దగ్గరకు వెళ్తేనే అసలు విషయం తెలుస్తుంది. దీని వెనుక ఒక కథ కూడా ఉంది, వింటావా?" అనగానే అభయ్ ఉత్సాహంగా "చెప్పండి తాతయ్యా!" అన్నాడు. "చాలా కాలం క్రితం రాఘవ అనే ఒక మేకల కాపరి ఉండేవాడు. అతను ప్రతిరోజూ తన మేకలను ఎండిపోయిన గడ్డితో, ఎత్తుపల్లాలున్న నేల మీద మేపాల్సి వచ్చేది. అతనికి కూడా నీలాగే దూరంగా ఉన్న కొండలు పచ్చగా, వెన్నలా నునుపుగా కనిపించేవి. 'అయ్యో! నా మేకలు ఇక్కడ కష్టపడుతున్నాయి, ఆ కొండల మీదకు వెళ్తే కడుపు నిండా మెత్తని పచ్చగడ్డి తింటాయి' అని ఆశపడ్డాడు. ఒకరోజు కష్టపడి తన మేకలను తీసుకుని ఆ కొండల మీదకు చేరుకున్నాడు. తీరా అక్కడికి వెళ్ళాక రాఘవకు ఆశ్చర్యం కలిగింది." అభయ్ ఆత్రుతగా "ఏమైంది తాతయ్యా?" అని అడిగాడు. తాతయ్య సాలోచనగా, "దూరం నుండి నునుపుగా కనిపించిన ఆ కొండలు, తీరా దగ్గరకు వెళ్ళాక పదునైన రాళ్లతో, ముళ్ళ పొదలతో నిండి ఉన్నాయి. పచ్చగా కనిపించినదంతా పనికిరాని నాచు మాత్రమే. మేకలు నడవడానికి కూడా అక్కడ దారి లేదు. అప్పుడు రాఘవ, 'అయ్యో! దూరం నుండి చూసి అనవసరంగా భ్రమపడ్డానే,

మన దగ్గర ఉన్నదే మనకు ఎంతో మేలు' అని గ్రహించాడు. దీనినే విజ్ఞానశాస్త్రంలో 'దృశ్య భ్రమ' అంటారు. గాలిలోని ధూళి కణాలు, కాంతి వల్ల వస్తువుల మీద ఉన్న గరుకుతనం దూరం నుండి మన కంటికి కనిపించదు. అందుకే అవి మెత్తగా ఉన్నట్లు అనిపిస్తాయి." "భలే ఉంది తాతయ్యా! మరి దీని వల్ల మనం ఏం నేర్చుకోవాలి?" అని అడిగాడు అభయ్. "చూడు అభయ్, ఇది మన జీవితానికి కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు, చాలామంది పల్లెటూళ్లలో ఉండటం కంటే, నగరాలకు వెళ్తే జీవితం రంగులమయంగా ఉంటుందని అనుకుంటారు. నగరం దూరం నుండి లైట్ల వెలుగుతో, పెద్ద భవనాలతో ఎంతో బాగుంటుందని భ్రమపడతారు. కానీ అక్కడికి వెళ్ళాక పెరిగే ఖర్చులు, కాలుష్యం, ట్రాఫిక్ కష్టాలు చూశాక.. 'మన పల్లెటూరి స్వచ్ఛమైన గాలే ఎంతో మేలు' అని అనుకుంటారు. అంటే ఏదైనా అనుభవంలోకి వస్తే తప్ప కష్టమో, సుఖమో తెలియదు." చివరగా తాతయ్య, "అందుకే అభయ్, దేనినైనా పైపైన చూసి మోసపోకూడదు. ఇతరుల జీవితాలు దూరం నుండి సుఖంగా కనిపించవచ్చు, కానీ ప్రతి ఒక్కరికీ తమవైన కష్టాలు ఉంటాయి. మనం ఉన్నదాన్ని గౌరవిస్తూ, వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి" అని ముగించాడు. తాతయ్య మాటలతో అభయ్‌కి ఆ జాతీయం అర్థం, దాని వెనుక ఉన్న విజ్ఞానం రెండూ బాగా అర్థమయ్యాయి.

– డా. పోతగాని సత్యనారాయణ
m : 9182531202

పాట

# కొబ్బరి మిఠాయి

కొబ్బరి మిఠాయి తెప్పిస్తా
నీకూ ఒకటి ఇప్పిస్తా
కొబ్బరి బెల్లం తెప్పిస్తా
నీకూ కొంత ఇప్పిస్తా
కథలూ.. పాటలు వినిపిస్తే
అంతా నీకే ఇప్పిస్తా!
ఇంకా ఎన్నో తెప్పిస్తా!



– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సంగలకు | : రూ. 750 |

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |




## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# మన ఫణిగిరి - చారిత్రక మణిగిరి


ఫణిగిరి గ్రామం హైదరాబాద్ నుండి జనగాం మీదుగా సూర్యాపేట వెళ్ళేదారిలో, నేటి సూర్యాపేట జిల్లా. నాగారం మండల కేంద్రానికి 4 కి.మీ. దూరంలో ఉంది. హైదరాబాద్ నుండి 140 కి.మీ. జనగాం నుండి 55 కి.మీ. సూర్యాపేట నుండి 40 కి.మీ. దూరంలో గల ఈ చారిత్రక గ్రామానికి ఆగ్నేయంగా 150 అడుగుల ఎత్తు పాము ఆకారం గల ఏకశిలాకొండపై సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన బౌద్ధారామాన్ని 1940లో అప్పటి నిజాం రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు ఖ్వాజా మహమ్మద్ అహ్మద్ గుర్తించారు. దక్షిణ భారతంలో ఏకైక అస్సక మహాజనపదం గోదావరి తీరంలో మొదలైన థెరవాద బౌద్ధం శాతవాహనుల నుండి అంటే క్రీ.పూ. 2వ శతాబ్ద నుండి క్రీ.శ. 4వ శతాబ్దానికి వచ్చే సరికి ఇక్ష్వాకుల కాలంలో మహాయాన బౌద్ధానికి ఆలవాలంగా రూపదిద్దుకొన్న మహా విహారమే ఫణిగిరి బౌద్ధ ఆరామం. ఈ ఫణికేంద్రంగా చుట్టుప్రక్కల పరిధిలో గాజులబండ, బిక్కేరు నానుకొని వర్ధమానుకోట, తిరుమలగిరి, నాగారం, చాడ, అర్వపల్లి, సింగారం, ఆర్లగడ్డ గూడెంలలో బౌద్ధారామ ఆనవాళ్ళు, విహారాలు, శిలామండపాలు, స్థూపాలు, శిల్పాలు, బుద్ధ విగ్రహాలు అనేకం బయల్పడినవి. ఫణిగిరిలో 1940-1944 మధ్యకాలంలో జరిగిన త్రవ్వకాల్లో నాలుగు ఆయక వేదికలు గల మహాస్థూపం, అనేక విహారాలు, రెండు చైత్యగృహాలు, రెండు శిలామండపాలు, మొక్కుబడి స్థూపాలు వెలుగుచూసాయి. క్రీ.పూ. 1వ శతాబ్ది బ్రాహ్మీశాసనం, అష్టమంగళ గుర్తులతో బుద్ధపాదాలు, బుద్ధప్రతిమలు, 40 సీసపు నాణేలు, రోమన్ అగస్టస్ నాణెం, 42 శాతవాహన, ఇక్ష్వాకుల బ్రాహ్మీశాసనాలు లభ్యమైనవి.

రెండో దశలో ఇక్కడ సుమారు 60 సంవత్సరాల తర్వాత 2001 నుండి వరుసగా 2007 వరకు 2007లో తిరిగి 2010 సంవత్సరాల్లో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో ఫణిగిరి బౌద్ధారామ శిల్పకళ అమరావతి శిల్పకళలో అత్యున్నత దశను ఫణిగిరి శిల్పకళ ప్రపంచానికి పరిచయం అయ్యింది. ఇక్కడ పూర్తి స్థాయి విహారాలు సుమారు 200 పైగా వెలుగు చూసాయి. 50 శిల్పఫలకాలు, 50 నాణేలు, మట్టిపూసలు, గాజులు, సున్నపు బొమ్మలు, మట్టిపాత్రలు లభించాయి. ఇక్కడ ముఖ్యంగా చెప్పుకోవాల్సింది మహా స్థూపద్వార తోరణాలు సాంచీ స్థూపానికి ఉన్నట్లే ఇక్కడ నాలుగు వైపులా తోరణాలు అత్యద్భుతంగా, ఇక్కడి శిల్ప ఫలకాలలో శిల్పకళ జీవశక్తి, రూపలావణ్యము, బావుకత్వము, అత్యంత మనోహరంగా చెక్కిన ఆనాటి శిల్పులను మనం నిజంగా స్మరించుకోకుండా, అభినందనలు తెలుపుకోకుండా ఉండలేం. ఇక్కడ దొరికిన బుద్ధుని శిల్పం, బుద్ధపాదాలు, తలభాగం లేని ఇక్ష్వాకుల రాజు నిలువెత్తు శిల్పం, స్థంభ శాసనాలు, జాతక కథలు, ఫలకాలు, 2018 - 2019 కాలంలో పూర్తి స్థాయిలో జరిగిన తవ్వకాల్లో అష్టభుజ స్థూపం కట్టడం శ్రీలంకలో రాజగాల అనే ప్రదేశంలో వెలుగు చూసిన బౌద్ధ ఘరను పోలి వుంది. ఇక్కడ దొరికిన ఇంకో అద్భుతమైన బోధిసత్వుని నిలువెత్తు సుమారు 6 అడుగుల సున్నపు (స్టక్కో) బొమ్మ భారతదేశంలోని సున్నపు బౌద్ధ విగ్రహాలలో పెద్దదిగా చెప్పుకోవాలి. ఇంత గొప్ప బౌద్ధ విహారంలోని అద్భుత శిల్పాలను ప్రపంచ ప్రఖ్యాత పురావస్తు నిపుణులు ఎన్నో సందర్భాల్లో ఇక్కడ సందర్శించి పరిశోధనలు చేశారు. 1950లోనే ఖ్వాజా మహమ్మద్ అహ్మద్ గారు వ్రాసిన ఫణిగిరి బౌద్ధారామ శిథిలాలు, 2010లో పురావస్తు శాఖ ప్రచురించిన Phanigiri Book, విదేశీ పరిశోధకులు పీటర్ స్కిల్లింగ్ 2018లో Site Document, 2021 ప్రఖ్యాత Marg Publication వారు వారసత్వ తెలంగాణ శాఖ, నాథన్ పి అవుజా సంపాదకత్వంలో వెలువడ్డ పుస్తకాలు, 2023లో ట్రీ అండ్ సర్పెంట్, మెట్రోపాలిటన్ న్యూయార్క్ మ్యూజియంలో ప్రదర్శించబడి ప్రచురించిన పుస్తకంలో ఫణిగిరి శిల్పకళా బౌద్ధ విహారాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా, ఇక్కడి అద్భుత శిల్పాలు పలు అత్యున్నత దేశాలలో ప్రదర్శించబడ్డాయి. ఇక్కడ పూర్తి స్థాయి త్రవ్వకాల రిపోర్టు ప్రస్తుతం ముద్రణలో ఉంది. గత 2 ఏళ్ళ క్రింద ఇక్కడి శిల్పాలన్నింటిని ఒక తాత్కాలిక హాల్‌ను నిర్మించి ప్రదర్శనకుంచారు. ఈ స్థలాన్ని పూర్తి స్థాయిలో సంరక్షణ చేసి, శాశ్వతంగా ఒక మ్యూజియంను నిర్మించి, పర్యాటకులకు, పరిశోధకులకు అందుబాటులోకి తెస్తే ఈ స్థలం కట్టడాలు, శిల్పాలు తెలంగాణలో ఒక ప్రపంచ స్థాయి బౌద్ధ ప్రదర్శనా, పరిశోధనా కేంద్రంగా ఫణిగిరి నిలవగలదు.

**- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి**

m : 9010051177

# కొవ్వొత్తి ఎందుకు ఆరిపోయింది?




అడుగున మూడు సెం.మీ. వ్యాసమూ, పైన ఒక సెం.మీ. వ్యాసమూ ఉన్న "శంఖు" (Cone) ఆకారపు కర్రముక్క తీసుకో. సుమారు జానెడు పొడుగున్న రాగి తీగను తీసుకుని ఆ కర్రముక్క చుట్టూ "సర్పిల" ఆకారంలో చుట్టుకుంటూ వెళ్లు. తరవాత కర్రముక్కను బయటకి లాగి, రాగితీగ స్ప్రైరల్‌ని వేరు చెయ్యాలి.

కొవ్వొత్తి మండటంలో ఒక చమత్కారం ఉంది. అగ్గిపుల్లగీసి, కొవ్వొత్తిని వెలిగించిన తరవాత, మంట వేడికి మైనం కరిగి, వత్తిగుండా పైకివచ్చి, వాయురూపం పొంది, అప్పుడు మండుతుంది.

రాగితీగ చక్కని ఉష్ణవాహకం కావడం వల్ల, మంటతాలూకు వేడినంతా పీల్చుకుని, మైనం కరగడానికి అడ్డం వస్తుంది. దానితో మంట ఆరిపోతుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్


'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి





# లాజికల్ రీజనింగ్ & ఆల్ఫాబెట్ టెస్ట్

సౌమ్య కృష్ణన్ ఉత్తరం వైపు 20 మీటర్లు నడిచింది. తరువాత ఆమె కుడి వైపుకు తిరిగి 30 మీటర్లు నడిచింది. తరువాత ఆమె కుడివైపుకు తిరిగి 35 మీటర్లు నడిచింది. తరువాత ఆమె ఎడమ వైపుకు తిరిగి 15 మీటర్లు నడిచింది. చివరికి ఆమె ఎడమ వైపుకు తిరిగి 15 మీటర్లు నడిచింది. ఆమె ప్రారంభ స్థానం నుండి ఏ దిశలో మరియు ఎన్ని మీటర్లలో ఉంది?

ఎ. పశ్చిమం 15 మీ. బి. తూర్పున 30 మీటర్లు
సి. పశ్చిమం నుండి సెం. 30 మీ. డి. తూర్పున 45 మీ.



లఘు నాటిక



# హోలీ ఆడుదాం...

**పాత్రలు: రమ్య, కేతన్ (అక్క, తమ్ముడు)**
**ఈశ్వర్, తనిష్క్(కేతన్ స్నేహితులు)**

## దృశ్యం - 1

కేతన్: తనీష్క్... ఒరేయ్ తనీష్క్... ఎక్కడరా?

తనిష్క్: ఆ వస్తున్న. ఏంట్రా చెప్పు?

కేతన్: నీకు తెలుసా రేపు ఏం విశేషమో?

తనిష్క్: రేపు హోలీ కదా! హేయ్ పండుగా!

ఈశ్వర్: అరేయ్ అందరం కలర్స్ పూసుకుంటాం. మస్తు ఎంజాయ్ చేస్తాం. అదే కదా కలర్స్ పండగ... హోలీ పండుగ.

రమ్య: ఏంటి దోస్తులందరూ ముచ్చట్లు పెడుతున్నారు?

కేతన్: అక్కా రా, అదే రేపు హోలీ పండుగ కదా! అదే మాట్లాడు కుంటున్నాం.

రమ్య: నేను నిన్ననే నానమ్మను హోలీ ఎలా చేసుకుంటారు? ఎందుకు చేసుకుంటారు? ఆ కథ ఏమిటి చెప్పమని అడిగాను. నానమ్మ నాకు ఆ కథంతా చెప్పింది.

కేతన్: అవునా, అక్క మాకు కూడా చెప్పవా?

ఈశ్వర్: నాకు తెలుసుకోవాలని ఉందక్కా.

తనిష్క్: చెప్పక్కా.

రమ్య: హోలీ వసంత కాలం రాకను, చెడుపై మంచి విజయాన్ని జరుపుకునే హిందువుల ప్రధాన రంగుల పండుగ.

ఈశ్వర్: మా అమ్మ చెప్పింది ఫాల్గుణ మాసపు పౌర్ణమి రోజు చేస్తారట కదా!

తనిష్క్: నాకైతే పండుగ రోజు ప్రజలు రంగులు చల్లుకుంటూ, ఆనందంగా గడుపుతారని మాత్రమే తెలుసు.

రమ్య: హోలీకి ముందు రోజు రాత్రి భోగి మంటలు హోలికా దహనం వేసి, దుష్టశక్తులను, అజ్ఞానాన్ని దహనం చేస్తారు.

కేతన్: హోలికా దహనమా?

ఈశ్వర్: ఎవరీ హోలిక?

రమ్య: చెప్తాను. మనమే అందరికీ చెబుదాం చిన్న గెటప్లతో ఇలా రండి.

(అందరూ రమ్య చుట్టూ మూగుతారు.
రమ్య వారికి చెబుతుండగా తెర)

## దృశ్యం - 2

(రమ్య-హోలికగా, తనిష్క్-ప్రహ్లాదుడుగా, కేతన్-హిరణ్య కశపుడుగా, ఈశ్వర్-భంటుగా చిన్న మార్పులతో రెడీ అవుతారు)

హోలిక: (రమ్య మెడలో పూల మాలతో కిరీటంతో వస్తుంది.) హోం హీం హ్రీం హ హ్హహ్హ ఎవరక్కడ?
(ప్రేక్షకులను చూసి) నేనెవరో తెలుసా?
(అటూ ఇటూ తిరుగుతూ) నేనూ నేనూ హోలికని నేనెవరో

తెలియాలంటే ముందు ఈ బాలకుడు రావలే ఎవరక్కడ?

భంటు: చిత్తం దేవి.

హోలిక: ప్రహ్లాదుడిని ప్రవేశపెట్టండి.

భంటు: చిత్తం దేవి.

(ఈశ్వర్ బయటకు వెళ్ళి బాలుడితో వస్తాడు.)

ప్రహ్లాదుడు: నారాయణ నారాయణ

హోలిక: ఓరీ బాలకా ఆపు ఆ నారాయణ మంత్రం.

ప్రహ్లాదుడు: అత్తా హోలికా అభివందనం

హోలిక: ఆపు బాలకా ఆపు.. (ఆడియన్స్‌ని చూస్తూ) చూసారా? ఈ బాలుడు ప్రహ్లాదుడు మా సోదరుడైన హిరణ్యకశిపుని కుమారుడు. వీడికి నేను అత్తని. అర్థమైంది కదా!

ప్రహ్లాదుడు: అత్తా మీరు నన్ను పిలిచారు కదా?

హోలిక: అవును రా బాలకా అన్నగారు ఒక పనిని అప్పగించారు.

ప్రహ్లాదుడు: నారాయణ నారాయణ... ఏమది?

హోలిక: అదిగో నువ్వు ఎంత చెప్పినా మన శత్రువైన ఆ విష్ణువును కలవడం, నారాయణ అనడం మాకు నచ్చలేదు. ఎవరక్కడ?

భంటు: చిత్తము దేవి (బయటకు వెళతాడు. హిరణ్య కశిపుడిని తీసుకొస్తాడు.)

హోలిక: అదిగో సోదరుడు హిరణ్యకశిపుడు వస్తున్నాడు. సోదరా స్వాగతం.

హి.క.: నేను పిలిచిన వెంటనే మా ప్రదేశానికి వచ్చి మాకు ఆనందం కలుగజేసావు.

హోలిక: సోదరా ఇంతకీ నన్ను ఎందుకు పిలిపించావు?

హి.క.: సోదరీ హోలికా నా కుమారుడు ప్రహ్లాదుడు ఉన్నాడే. (ప్రహ్లాదుడిని వేలెత్తి చూపుతూ) అస్తమానం నారాయణ నారాయణ అనుచు నా శత్రు జపం చేస్తున్నాడు.

హోలిక: అవును సోదరా నేనును గమనించితిని.

హి.క.: విష్ణుమూర్తి చేతిలో నా తమ్ముడు మరణించాడు. అతడు నాకు శత్రువు. అందుకు ప్రతీకారంగా ప్రతీకారం తీర్చుకోవడానికి బ్రహ్మ కోసం తపస్సు చేసి మనిషి మృగం పగలు రాత్రి లోపల బయట మరణం లేకుండా అజయ వరం పొందాను. కనుక నన్ను ఎవరూ చంపలేరు. హహహ నన్ను ఎవరు చంపలేరు!

హోలిక: అవును అన్నగారు తెలుసు.

హి.క.: అయినను ఈ బాలకుడు నా కొడుకు అని చెప్పుకొనుటకు సిగ్గు చేటు! మన శత్రువు నామము జపించుటయ. అతనిక బ్రతికి లాభము లేదు. హోలికా!

హోలిక: సోదరా సెలవీయండి.

హి.క.: నీవు మంటలలో కాలిపోకుండా నీ శరీరముపై ఒక వస్త్రము వరముగా పొందితివి కదా ఆ వస్త్రము ఉన్నంత వరకు నీవు మంటలలో కాలిపోవు కదా!

హోలిక: అవును సోదర ఏ మంటా నన్ను కాల్చలేదు ఈ వస్త్రము ఉండగా. నాకు మంటలు అంటుకోవు.

హి.క.: అయినచో నీవు ఈ బాధకుడిని నీ ఒడిలో కూర్చోబెట్టుకో మేము కింద నుంచి చితి మంటలు ఏర్పాటు చేస్తాం. నీవు కాలవు గనుక నీ ఒడిలో ఉన్న ఈ బాలుడు బూడిద పాలవుతాడు. నాకు శత్రు శేషం లేకుండా పోతుంది.

హోలిక: అటులనే... ప్రహ్లాదా ఇటురా అంటూ తన ఒడిలో కూర్చోపెట్టుకుంటుంది.

ప్రహ్లాదుడు: నారాయణ, నారాయణ (హోలిక ఒడిలో కూర్చొని ఇంకా గట్టిగా) ఓం నమో నారాయణ ఓం నమో నారాయణ (అంటుంటాడు) (చీకటి లైట్లు ఆన్ ఆఫ్ అవుతూ ఎరుపు రంగు లైటు పడుతుండగా)

హోలిక: మంటలు మంటలు నా వస్త్రము ప్రహ్లాదునిపై చేరిందేమిటి? నేను చేసిన పని అధర్మము అందువలన నేను దహించుకుపోతున్నానా! నా వరము పని చేయక ప్రహ్లాదుడు మీద ఆ వస్త్రము చేరినదా? (హోలిక కింద పడుతుంది)

ప్రహ్లాదుడు: నారాయణ నారాయణ (ముందుకు వస్తాడు) (లైట్స్‌ఆఫ్)

### దృశ్యం - 3

(అందరూ మామూలుగా వచ్చి నిలబడతారు)

రమ్య: అదండీ అమాయకమైన ప్రహ్లాదుని చంపడానికి సిద్ధపడిన హోలిక రాక్షసి మంటల్లో కాలి పోయింది. కనుక మనం కూడా చెడును మంటల్లో వేసి మంచి కోసం హోలికా దహనం చేయాలి. అప్పటి నుంచి హోలీ ముందు రోజు హోలికా దహనం చేస్తారు.

కేతన్: అర్థమైంది అక్కా. ఈ రాత్రి మనం మన పెద్దవారి పర్యవేక్షణలో హోలికా దహనంలో పాల్గొందాం.

తనిష్క్: చుట్టూ తిరిగి నాట్యం కూడా చేస్తారు కదా!

ఈశ్వర్: రేపు రంగులు కూడా చర్మానికి హాని చేయని రంగులే చల్లుకోవాలి కదా అక్కా రమ్య, తనిష్క్, కేతన్.

ఈశ్వర్: (ఒకేసారి) అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు. హోలీరే హోలీ లిలిలిలిలి.

- డా. సమ్మెట విజయ
m: 99898 20215

# బాల్య వివాహం


అది ఒక పల్లెటూరు. ఆ ఊరి పేరు రేగులపల్లి. అక్కడ అందరూ ఆనందంగా నివసించేవారు. అందులో శంకర్, కల్పన అనే దంపతులు వారికి అభి, ఆద్య అనే కొడుకు కూతురు ఉన్నారు. అభి, ఆద్యలకు చదువంటే చాలా ఇష్టం. ఐదవ తరగతి వరకు చాలా చక్కగా చదివాడు అభి. కానీ ఆరవ తరగతి నుండి వారి స్నేహితుల ద్వారా చదువు మీద ఆసక్తిని చూపించడం మానేశాడు. కానీ ఆద్యకి చదువుకోవడం అంటే చాలా ఇష్టం. అభికి మాత్రం వాళ్ళ స్నేహితులతో ఆడుకోవడం, సినిమాలు చూడడం, వీధుల్లో తిరగడం అలవాటు అయ్యాయి. వాళ్ళ అమ్మ నాన్న ఎంత చెప్పినా వినేవాడు కాదు. కానీ ఆద్య మాత్రం చాలా తెలివైనది. ఆద్య చదువులో, ఆటల్లో అన్నిటిలో ముందుండేది. ఆద్యకు టీచర్ అవ్వాలని కోరిక ఉండేది. అలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. అభికి పదమూడేళ్లు, ఆధ్యకు పదకొండు ఏళ్లు వచ్చాయి. గ్రామంలోని పెద్దలు ఆద్యకు పెళ్లి చేస్తే బాధ్యత తీరుతుంది అని శంకర్ కల్పనలపై ఒత్తిడి తెచ్చారు. చదువు కన్నా పెళ్లి ముఖ్యమని భావించి వాళ్లు కూడా ఆ మాటలకు ఒప్పుకున్నారు. ఒక రోజు ఆద్యకు వాళ్ల నాన్న పెళ్లి విషయం చెప్పారు. ఆద్య మాత్రం నాన్న నాకు చదువుకోవాలని ఉంది. టీచర్ కావాలని కోరిక ఉంది. ఇప్పుడే పెళ్లి చేసుకోను అని చెప్పింది. కానీ తల్లిదండ్రులు వినలేదు. ఆమెకు పెళ్లి జరిపించారు. చిన్న వయసులోనే బాధ్యతలు మీద పడ్డాయి. ఆద్య చదువు ఆగిపోయింది తన కలలు కరిగిపోయాయి. అభి కూడా పని చేయాల్సి వచ్చింది. సరియైన ఉపాధి దొరకక రోజులు కష్టంగా గడిచాయి. అప్పుడు వాళ్లకు అర్థమైంది చదువు లేకుండా జీవితం ఎంత కష్టమో అని. బాల్య వివాహం ఎంత నష్టమో అని. అదే సమయంలో ఆ గ్రామంలోకి షీ టీమ్స్ వాళ్ళు వచ్చి బాల్య వివాహం ద్వారా జరిగే అనర్థాలను వివరించారు. వారి సహాయంతో ఆద్య మళ్లీ చదువుకోవడం మొదలుపెట్టింది. భర్త ప్రోత్సాహం కూడా లభించింది. అభి కూడా తన తప్పును తెలుసుకొని చదువుపై ఆసక్తి పెంచుకొన్నారు. ఇద్దరు అభి, ఆద్యలు చివరకు బాగా చదువుకొని ఉద్యోగాలు సంపాదించి వారి జీవితాన్ని మార్చుకున్నారు.





- యు.సౌమ్య
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
గ్రా. రేగులపల్లి
m: 9603389441

# విద్యుదయస్కాంతత్వానికి వారిద్దరూ రెండు ముఖాలు

ఒకరు కడు పేదరికం నుంచి రావడమే కాదు స్వయం కృషితో నమ్రతతో అంచలంచెలుగా ఎదిగినవాడు; అప్లైడ్ ఫిజిక్స్‌లో గొప్ప పరిశోధనలు సాధించి అద్భుతంగా నిలిచాడు. మరొకరు ధనవంతుల ఇంట జన్మించి విశ్వవిద్యాలయ స్థాయి పరిశోధన చేయగల సౌలభ్యం ఉన్న వ్యక్తి. ఆయన సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో ఉత్కృష్టమైన ఫలితాలు సాధించాడు. ఏమాత్రం పోలికా, సారూప్యం లేని ఈ శాస్త్రవేత్తలిద్దరు చేసిన కృషి విద్యుదయస్కాంతానికి రెండు పార్శ్వాలను వివరించినట్లయ్యింది. వారే మైఖేల్ ఫారడే (1791–1867), జేమ్స్ క్లర్క్ మాక్స్వెల్ (1831–1879). వయసులో 40 ఏళ్లు పెద్దవాడైన ఫారడే తొలుత విద్యుదయస్కాంత తరంగాల ధర్మాలు, నియమాలు పరిశీలించి సూత్రీకరణలు చేస్తే; తర్వాత మాక్స్వెల్ వాటన్నిటిని గణితాత్మక చట్రంలో బిగించి, ఏర్పరిచిన సూత్రాలను 'మ్యాక్స్వెల్ సమీకరణాలు'గా పేర్కొంటాం. వీరిద్దరి పరిశోధనలు ఎంతో స్ఫూర్తినిస్తే, వారి జీవిత నేపథ్యం మరింత ఉత్తేజాన్ని నింపుతుంది.



Michael Faraday



James Clerk Maxwell

తల్లికి సాయం చేయాలని మైఖేల్ ఫారడే (Michael Faraday)13 ఏళ్ల వయసులో పుస్తకాల బైండింగ్ షాపులో పనివాడిగా కుదిరాడు. వినయం, తెలివి, కృషి కలగలిసిన ఫారడే పుస్తకాల బైండింగ్‌లో పై స్థాయికి వెళ్ళాడు. ఆసక్తి కలిగిన పుస్తకాలను రాత్రిపూట చదివేసి, మళ్ళీ ఉదయం ఆ షాపులోనే పెట్టేసేవాడు. ఒకసారి సర్ హంఫ్రీ డేవి (Sir Humpry Davy)చేసిన సైన్స్ ప్రసంగాన్ని శ్రద్ధగా విని, నోట్స్ రాసి ఆయనకు పంపుతూ రాయల్ సొసైటీలో ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పించమని ఉత్తరం రాసాడు. ఫారడే చురుకుదనాన్ని, తెలివిని గమనించిన డేవీ తన ప్రయోగశాలలో సహాయకుడిగా నియమించాడు. తన ప్రసంగాలకు కూడా సహాయకుడిగా పనిచేసేలా ఏర్పాటు. ఫార్మల్ ఎడ్యుకేషన్ లేకపోయినా స్వయంకృషి, మేధస్సు, సౌజన్యంతో సహాయకుడి స్థానం నుంచి శాస్త్రవేత్త స్థాయికి చేరాడు ఫారడే. తర్వాత దశలో ఆయన చేసిన పరిశోధనలు ఫారడేను రాయల్ సొసైటీ డైరెక్టర్ ను కూడా చేశాయి. నీల్స్ బోర్ (Niels Bohr)అనే శాస్త్రవేత్త ఫారడే పరిశోధనల కన్నా, ఆయన జీవితమే ఎక్కువ ఆసక్తి కలిగిస్తుందని వ్యాఖ్యానించాడు.

న్యాయ శాస్త్రం చదువుకున్న ధనవంతుడు ఇంట జేమ్స్ క్లర్క్ మాక్స్వెల్ (James Clerk Maxwell) జన్మించాడు. ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో చదువుకునే సమయంలో ఆయన చురుకుదనాన్ని గమనించి, ఎటువంటి ప్రయోగాలనైనా సర్వ స్వతంత్రంగా చేసుకొనే వీలు కల్పించారు. ఫారడే రాసిన ప్రాయోగిక పరిశోధనలు పుస్తకం చదివి 1855లో మ్యాక్స్వెల్ మంచి పరిశోధన పత్రాన్ని వెలువరించాడు. 65 ఏళ్ల శాస్త్రవేత్త సాధించిన కృషిని 25 ఏళ్ల యువకుడు విశ్లేషించి, గుర్తింపు పొందడం చిన్న విషయం కాదు. నిజానికి భౌతిక శాస్త్రంలో 1820 సం. దాకా విద్యుత్తు, అయస్కాంత ధర్మాలను వేర్వేరు విషయాలుగా, సంబంధం లేని వ్యవహారాలుగా భావించేవారు. విద్యుత్తు ప్రవహించే తీగ దగ్గరికి అయస్కాంత సూచిక తెచ్చినప్పుడు, అందులో మార్పు తొలిసారి 1820లో గమనించాడు ఆయర్ స్టెడ్ (Orsted) అనే శాస్త్రవేత్త. తర్వాత సావర్ట్ (Savart), అరేగో (Arago), ఆంపియర్ (Ampere), గౌస్ (Gause) మొదలైన శాస్త్రవేత్తలు ఎన్నో పరిశీలనలు చేశారు. వీటన్నింటినీ గమనించి ఫారడే విద్యుత్తు, అయస్కాంతత్వాల ఎన్నో ధర్మాలను, నియమాలను క్రోడీకరించగలిగాడు. కానీ సైద్ధాంతికంగా ఆయా ధర్మాలను వివరించ లేకపోయాడు. సరిగ్గా ఈ దశలో మ్యాక్స్వెల్ ప్రవేశించి ఫారడే ఎక్కడ ఆగారో, అక్కడి నుంచి ముందుకు సాగి విద్యుదయస్కాంత సమీకరణాలను రూపొందించాడు. మెకానిక్స్‌లో న్యూటన్ గమన సూత్రాలు ఎంత ముఖ్యమో; విద్యుదయస్కాంత తత్వంలో మాక్స్వెల్ సమీకరణాలు అంత కీలకం. మ్యాక్స్ సమీకరణాలు నాలుగు. ఒకటోది విద్యుత్ క్షేత్రాన్ని వివరించేది కాగా, రెండవది అయస్కాంత క్షేత్రానికి సంబంధించింది. విద్యుత్ క్షేత్రాన్ని మారిస్తే, ఉత్పన్నమయ్యే అయస్కాంతత్వాన్ని వివరించేది మూడో నియమం. ఇక నాలుగో సూత్రం అయస్కాంత క్షేత్రాన్ని మార్చితే కలిగే విద్యుత్ ప్రవాహాన్ని వివరిస్తుంది. ఈ నాలుగు నియమాలు చాలా అద్భుతంగా అనిపిస్తాయి. వీటిని గమనించిన బోల్ట్ మన్ (Boltzmann) అనే శాస్త్రవేత్త ఈ సమీకరణాలలోని సొగసును, మేధస్సును చూసి, వీటిని రాసింది ఆ దేముడా అని తెగ ఆశ్చర్యపోయాడు. మైకేల్ ఫారడే భార్య సారా చాలా చేదోడు వాదోడుగా ఉంటూ ఆయన కష్ట సమయాల్లో ఎంతో తోడ్పాటుగా ఉండేది. ఇక మ్యాక్స్వెల్ భార్య మేరీదీవార్ పరిశోధనలలో కూడా సహాయకారిగా ఉండటమే కాకుండా. ఆయనకు మశూచి వచ్చినప్పుడు ఎంతో సేవ చేసి ఆయన మరల బ్రతికేట్టు కృషి చేశారు. ఫారడే జన్మించిన నాలుగు దశాబ్దాలకు పుట్టిన మాక్స్వెల్, ఫారడే గతించిన 12 ఏళ్లకు కనుమూశారు.

– డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392

చెట్టు - చేమ

# బొప్పాయి చెట్టు





బొగున్నారా బాలలూ! పరీక్షల సమయం వచ్చేసింది. బాగా చదువాలంటే మనం ఆరోగ్యంగా ఉండాలి కదా!. అందుకే మార్చి నెల బాలచెలిమి సంచికలో బొప్పాయి చెట్టు గురించి తెలుసుకుందాం. బొప్పాయి సాధారణంగా కనిపించే పండ్ల జాతికి చెందిన చెట్టు. కొన్ని ప్రాంతాలలో పొప్పడి పండ్ల చెట్టు అని కూడా అంటారు. దీనిని చూడని వారు ఎవరు ఉండరు. కొద్దిపాటి జాగాలో కూడా పెరిగి తక్కువ కాలంలో పండ్లనిస్తుంది. బొప్పాయి కారికేసి వంశంలో కారికా జాతికి చెందిన వృక్షం. దీని కాండం మెత్తగా ఉంటుంది. ఆకులు వెడల్పుగా చీలి ఉంటాయి. దీని పండ్లు ఆహారంగాను, వైద్యం కొరకు మందులలోను వాడుతారు. మెక్సికో, మధ్య అమెరికాతో పాటు చాలా దేశాలలో ఈ పండ్ల వృక్షం పెంచుతారు. ఇది ఉష్ణ మండలంలో పండే పంట. బొప్పాయి అన్ని నేలల్లో సాగు చేయవచ్చు. ప్రతి ఇంటి పెరడులో ఉండే కొద్దిపాటి జాగలో మురికి నీరు ప్రవహించే చోట కూడా వీటిని పెంచుకోవచ్చు.

బొప్పాయి పండులో విటమిన్ ఏ, సి, ఈ మరియు పపైన్ ఎంజైమ్ పుష్కలంగా ఉండి జీర్ణక్రియను మెరుగు పరచడం, రోగ నిరోధక శక్తి పెంచడం, మరియు చర్మ ఆరోగ్యానికి అద్భుతంగా పనిచేస్తుంది. బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు సమృద్ధిగా లభిస్తాయి. బొప్పాయి పండును ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని పెంచుతుంది. సాధారణంగా ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల శరీరంలోని పొట్ట ప్రేగులలో విష పదార్థాలు బయటికి వెళ్లిపోతాయని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. రాత్రిపూట తినకుండా ఉంటే మంచిది. పండిన బొప్పాయి జీర్ణక్రియ, మానసిక స్థితి మరియు తేలిక పాటి గర్భాశయ మద్దతు విషయంలో సహాయపడుతుంది. కానీ బొప్పాయి రుతుస్రావం సమయంలో తీసుకుంటే నష్టం కూడా జరగొచ్చు. చర్మాన్ని కాంతివంతం చేయడానికి బొప్పాయి పండు ఎంతో మంచిది. చర్మ సౌందర్యం తో పాటు మన ఆరోగ్యానికి అనేక క్రీములకు బొప్పాయి పండ్లు మెడిసిన్‌గా ఉపయోగ పడతాయి. మలబద్ధకాన్ని కూడా నివారిస్తుంది. బొప్పాయి పండ్లు తింటే కంటి ఆరోగ్యానికి రక్షణ ఉంటుంది. వేసవిలో ఈ పండ్లను తక్కువ మోతాదులో తినాలి. ఈ పండ్లు తినడం వల్ల, బొప్పాయి ఆకు రసం తాగడం వల్ల మన శరీరంలో ప్లేట్ లెట్స్ పెరుగుతాయి. ఈ పండ్లలో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల శరీర బరువు కూడా తగ్గించుకోవచ్చు. చెడు కొలెస్ట్రాల్ తగ్గడానికి ఎంతో ఉపయోగపడతాయి. మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు ఈ పండ్లు తినడం వల్ల తగ్గించుకోవచ్చు. ఈ పండ్లతో జ్యూస్ తయారు చేసుకుని తాగవచ్చు. డెంగ్యూ లక్షణాలు తగ్గిపోతాయి. చర్మంపై మొటిమలు తగ్గి చర్మం నాజూకుగా అందంగా కనిపిస్తుంది. బొప్పాయి గుజ్జుని మొహానికి రాయడం వల్ల మంచి మెరుపు వస్తుంది. జిడ్డు తగ్గుతుంది. బొప్పాయి తామర వ్యాధిని తగ్గిస్తుంది. అధిక పోషక విలువలు కలిగిన ఈ బొప్పాయి పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

చూశారు కదా బాలలూ...! ఎన్నో లాభాలు ఉన్న ఈ బొప్పాయి చెట్లను వెంటనే మనం కూడా మన ఇంటి స్థలములో, పాఠశాల ఆవరణలో పెంచుకుందాం. ఓకే నా. వచ్చే నెలలో మరో చెట్టు గురించి తెలుసుకుందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


మూర్ఖత్వం హానికరం
కథ :
జుగాష్‌విలి
బొమ్మలు:
గోపి: తాతయ్యా! ఈ రోజు మా స్కూల్లో ఒక విచిత్రం జరిగింది.
తాతయ్య: విచిత్రమా ఏమైంది గోపీ!
గోపి: మా క్లాస్‌లో రాము, సోము ఇద్దరూ మంచి స్నేహితులు. నిన్న సాయంత్రం ఇద్దరూ చెరువు గట్టుకి వెళ్ళారట. పక్కనే పంట చేను కళకళలాడుతూ చిరుగాలికి అటూ యిటూ ఊగుతుందట. అప్పుడు సోము ఇలా అన్నాడట.
తాతయ్య: ఏమన్నాడు...
సోము: ఒరే రామూ పంట చూడు బ్లూ రంగులో ఎలా మెరిసిపోతుందో!
రాము: అదేమిటి సోమూ! ఆకుపచ్చ రంగులో మిలమిలా మెరిసిపోతుంటేనూ...
సోము: కాదు... బ్లూ కలర్‌లోనే ఉంది.
రాము: కాదు. ఆకుపచ్చగా ఉంది. సరిగ్గా చూడు. కావాలంటే ఎవరినైనా అడుగుదాం.


సోము: ఎవరో ఎందుకు? నాకు తెలియదా? నువ్వెంత వాదించినా నేనొప్పుకోను. బ్లూ కలర్‌లోనే ఉంది... అంతే... అంతే...
రాము: నేనూ ఒప్పుకోను... ఆకుపచ్చే కరెక్ట్.
తాతయ్య: ఇంతకీ ఏం తేల్చారట!
గోపి: ఇలా చీకటి పడేవరకూ వాదించుకుంటూనే యింటికి చేరారట.
గోపి: ఈ రోజు ఉదయం ప్రేయర్ కాగానే ఇద్దరూ మాస్టారి దగ్గరకొచ్చి యిదే వాదన వినిపించారు.
తాతయ్య: మాస్టారేమన్నారు. సోముని కోప్పడ్డారా?
గోపి: లేదు. రామూ! నువ్వు తప్పు చేసావు 10 గుంజీళ్ళు తీయ్ అన్నారు. రాము గుంజీళ్ళు తీసాడు. సోము విజయగర్వంతో నవ్వుకున్నాడు.
తాతయ్య: అరే... యిదేమిటి?
గోపి: రాము మాస్టారి దగ్గరకొచ్చి మాస్టారూ! నేను తప్పు చెప్పానా అని అడిగాడు.
తాతయ్య: బాగా అడిగాడు. లేకపోతే...
గోపి: అప్పుడు మాస్టారు 'లేదు రామూ! నువ్వు చెప్పిందే కరెక్ట్. అయితే నువ్వు తప్పు చేసావు. మూర్ఖుని మనసు రంజింపచేయలేమని నీకు తెలియదా. మూర్ఖుడా సోముతో గంటన్నర వాదించి నీ టైమ్ వేస్ట్ చేసుకున్నావు. అందుకే నీకీ గుంజీళ్ల శిక్ష... ఇక ఎప్పుడు ఇలా చేయకు అన్నారు. మూర్ఖునితో వాదించి ప్రయోజనం లేదని మా అందరికీ బాగా అర్థమయింది తాతయ్యా!
తాతయ్య: నిజమేరా గోపి!

స్పోర్ట్స్

# ACC Women's Asia Cup

# భారత్‌కు రెండో సారి టీ20 కప్






ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని మళ్లీ భారత అమ్మాయిలే దక్కించుకున్నారు. తేజల్ హసబ్నిస్ (34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51 నాటౌట్) మెరుపు హాఫ్ సెంచరీకి తోడు లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్ (3/12) తిప్పేసిన వేళ ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 'ఎ' 46 పరుగులతో బంగ్లాదేశ్ 'ఎ'ను చిత్తు చేసింది. తొలుత భారత్ 'ఎ' 20 ఓవర్లలో 134/7 స్కోరు చేసింది. కెప్టెన్ రాధా యాదవ్ (36), దినేశ్ వ్రింద (19) కీలక ఇన్నింగ్స్ ఆడారు. స్పిన్నర్ ఫహీమా ఖాతూన్ నాలుగు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ 'ఎ' 19.1 ఓవర్లలో 88 పరుగులకే కుప్పకూలింది. తనూజా కన్వర్, సోనియా మెంధియా చెరో రెండు వికెట్లు సాధించారు. తేజల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఓ దశలో 44 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో తేజల్, రాధా యాదవ్ ఐదో వికెట్‌కు 89 పరుగులు జోడించడంతో భారత్ తేరుకుని పోరాడే స్కోరు చేసింది. ఆపై ఛేదనలో భారత బౌలర్ల విజృంభణకు బంగ్లాదేశ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 2023లో తొలిసారి నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లోనూ బంగ్లాదేశ్‌నే ఓడించిన భారత్ విజేతగా నిలవడం విశేషం.

**స్కోర్లు:** **భారత్ 'ఎ':** 20 ఓవర్లలో 134/7 (తేజల్ హసబ్నిస్ 51 నాటౌట్, రాధా యాదవ్ 36, దినేశ్ వ్రింద 19, ఫహీమా ఖాతూన్ 4/25) **బంగ్లాదేశ్ 'ఎ':** 19.1 ఓవర్లలో 88 ఆలౌట్ (షమీమా సుల్తానా 20, సర్మిన్ సుల్తానా 18, ఫహీమా ఖాటున్ 14, ప్రేమా రావత్ 3/12, తనూజా కన్వర్ 2/11, సోనియా 2/21).

– బాలచెలిమి డెస్క్

## 'ఓల్డ్ పర్సన్ డే'లో ఆకట్టుకున్న కాత్యాయిని



ఐదేళ్ల చిన్నారి కాత్యాయిని ప్రస్తుతం Siate Felici School పాఠశాలలో పిపిఐ తరగతిలో చదువుతోంది. "ఓల్డ్ పర్సన్ డే" సందర్భంగా ఆమె ధరించిన వేషధారణ ఆకట్టుకుంది. నీలిరంగు చీరను చక్కగా కట్టుకుని, కళ్లజోడు పెట్టుకుని, చేతిలో కర్ర పట్టుకుని వంగి నడిచే తీరు నిజమైన పెద్దమ్మను తలపించేలా ఉంది. తలపై తెల్ల జుట్టు విగ్ ధరించడం వల్ల ఆమె మరింత సహజంగా కనిపించింది. ముఖంలో మెరిసిన అమాయకత్వం, సరదా భావాలు కుటుంబ సభ్యుల హృదయాలను కట్టిపడేశాయి. ఈ అందమైన వేషాన్ని కాత్యాయిని నాయన్నమైన ధరణి గారు ఎంతో ప్రేమతో, శ్రద్ధతో సిద్ధం చేయడం విశేషం. ఇలాంటి వేషధారణ కార్యక్రమాలు చిన్నారుల సృజనాత్మకతను, ఊహాశక్తిని, నటన నైపుణ్యాన్ని వెలికితీస్తాయి. పాత్రలో లీనమవడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలాగే పెద్దల జీవన విధానాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కూడా చిన్ననాటి నుండి అలవర్చుకుంటారు. (Cover Page Photo courtesy by Laxmi Niharika & Swetha)

కథ

# అత్యాశ




బెస్తాపురంలో రాము అనే చేపల పట్టే వ్యక్తి అతని భార్య లక్ష్మి ఉండేవాళ్ళు. వాళ్ళది మధ్యతరగతి జీవనం. రాము భార్య లక్ష్మికి ఆశలు ఎక్కువ. ధనవంతురాలు అవ్వాలని, కనీసం అట్లా కనిపించాలని తాపత్రయ పడుతూ ఉండేది. పాపం రాము రోజు కష్టపడి పని చేస్తూ ఉండేవాడు. ఉన్నంతలో లక్ష్మి కోరికలు తీరుస్తూ ఉండేవాడు.

ఒకరోజు లక్ష్మి రాముతో కోపంగా ఇలా అంటుంది ఏమయ్యా పట్టీలు కావాలని రోజు అడుగుతున్నాను. కానీ నువ్వు మాత్రం అస్సలు తేవడం లేదు. నువ్వు ఏమైనా చేయి. ఈరోజు మాత్రం నాకు పట్టీలు తేవాల్సిందే అని పట్టుబట్టింది. చేసేది ఏమీ లేక సరే అని సముద్రంలో చేపలు పట్టడానికి వెళ్లిపోయాడు. సమయం గడిచింది. రాముకి భయం మొదలైంది. రాము దిగులుపడుతూ తీరాన ఒంటరిగా కూర్చున్నాడు. ఆ రోజు చేపలు కూడా సరిగ్గా పడలేదు. ఇంటికాడ లక్ష్మి పట్టీల కోసం ఎదురు చూస్తూ ఉంటుందని రాముకు తెలుసు. ఇంకా భయపడటం మొదలుపెట్టాడు. భయపడుతున్న రాముని చూసిన ఒక జలకన్య రాము దగ్గరికి వచ్చి ఇలా అంటుంది. 'నాయనా! రాము! నువ్వు భయపడకు. బాధ అసలే పడకు. నీకు కావాల్సింది ఇదిగో' అని రాము చేతిలో పట్టీలను పెట్టి వెళ్లిపోయింది జలకన్య. ఆశ్చర్యంతో రాము ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. ఆ పట్టీలను తీసుకెళ్లి లక్ష్మికి ఇచ్చాడు. మరియు జలకన్య గురించి లక్ష్మికి వివరించాడు. జలకన్య గురించి విన్న లక్ష్మి రాము మీద ఇంతెత్తు లేచింది. 'నువ్వు నిజంగా పిచ్చివాడివి. జలకన్య వస్తే మన ఇల్లు మొత్తం ధనంతో నిండిపోవాలని అడగకుండా ఉత్తి పట్టీలనే తీసుకొచ్చావు. నువ్వేం మనిషివయ్యా!' అని గట్టిగ తిట్టి, రేపు మళ్లీ జలకన్యను అడిగి చాలా డబ్బు అడుగు' అని కసురుకుంటుంది. మరుసటి రోజు రాము మళ్ళీ సముద్రం దగ్గరికి వెళ్లి దిగాలుగా కూర్చున్నాడు. చీకటి పడేసరికి జలకన్య మళ్లీ వచ్చి రాముకు కావలసిన ధనం ఇచ్చి వెళ్ళిపోయింది. రాము ఇంటికి వెళ్లి జలకన్య ఇచ్చిన ధనాన్ని లక్ష్మికి ఇచ్చాడు. అయినా లక్ష్మి ప్రాణం చల్లబడలేదు.

మళ్లీ మరుసటి రోజు ఇంకా ధనం అడగమని రాముతో చెప్పింది లక్ష్మి. 'ఆశకు హద్దుండాలి. మనిషికి సిగ్గుండాలి' అని రాము చెప్పగానే లక్ష్మి రాముపై గట్టిగట్టిగా అరిస్తూ చెప్పింది చేయమని హెచ్చరిస్తుంది. లక్ష్మి మాటలు పడలేక తెల్లారిన వెంటనే రాము సముద్రం దగ్గరికి వెళ్లి జలకన్యతో జరిగిందంతా చెప్తాడు. 'సరే రాము! నువ్వు ఒక్కసారి మీ ఇంటికి వెళ్లి చూడు. నీ భార్యకు ఈ రోజు కచ్చితంగా బుద్ధి వస్తుంది. నువ్వు ఇక దిగులు పడకు. అని జలకన్య రాముతో నవ్వుతూ చెప్పి వెళ్లిపోయింది. రాము ఏం జరుగుతుందో ఏమో అని ఇంటికి వెళ్ళాడు. ఇంటికి వెళ్లేసరికి రాము ఇల్లు మొత్తం బంగారంతో నిండిపోయింది. ఎటు చూసినా బంగారమే తన భార్య ఎక్కడున్నదా అని లోపలికి వెళ్లి చూస్తే ఇంకేముంది లక్ష్మి నిజంగా లక్ష్మీదేవి లాగా మొత్తం బంగారంగా మారిపోయింది. ఒక్క నోరు తప్ప. ఒక్క ముక్క కాలు కదిలించలేకపోతున్నది, చెయ్యి కదిలించలేకపోతున్నది. ఆకలి వేస్తున్నది. తిందామంటే చెయ్యిలేస్తలేదు. లేద్దామంటే నడుము ఒంగుతలేదు. బంగారమాయే. కంటికి మంటికి ఏకధాటిగా ఏడవడం మొదలు పెట్టింది లక్ష్మి. రాము "ఏందే ఇదంతా, మనకు ఉన్నది చాలు అంటే డబ్బు డబ్బు అంటూ వెంట పడ్డావ్.

ఇప్పుడు చూసావా ఏమైందో! తృప్తితో కలిగే సంతోషం, ఆ సంతోషాన్ని మించిన స్వర్గం ఎక్కడుంటది చెప్పు? అత్యాశ వద్దు అంటే వినకపోతే అని అన్నాడు సూరి. 'అవునయ్యా! మనకు ధనం వద్దు గినం వద్దు. ఉన్నది చాలు. నాకు నువ్వు నీకు నేను, సంతోషంగా బత్కుదాం. జలకన్య దగ్గరికి వెళ్లి క్షమాపణలు చెప్పి, మన పాత ఇల్లు మొత్తం ఎలా ఉందో అలా చేయమని అడుగుదాం అన్నది లక్ష్మి ఏడుస్తూ.

వెంటనే ఇద్దరూ జలకన్య దగ్గరికి వెళ్లి క్షమాపణలు చెప్పారు. వాళ్ళ సంతోషాన్ని వాళ్ళు తిరిగి పొందారు. నాటి నుండి అత్యాశకు పోకుండా తమకు ఉన్నంతలో తృప్తిగా జీవనం సాగిస్తున్నారు.

– ఎన్. ఝాన్సి
8వ తరగతి.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తొర్రూర్,
అబ్దుల్లాపూర్ మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా



మా చిన్న మాదారం ఉన్నత పాఠశాల నుండి 54 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులతో కలిసి డిసెంబర్ 28, 2025 నుండి జనవరి 3, 2026 వరకు ఏడు రోజుల విజ్ఞాన యాత్రకు వెళ్లాము. నల్లగొండ, రాయచూరు మార్గంగా హంపి చేరి తుంగభద్ర నదిలో స్నానం చేసి విరూపాక్షేశ్వర ఆలయాన్ని దర్శించాము. గోకర్ణం బీచ్, బేలూరు, హళేబీడు, శ్రావణబెలగోలలో గోమటేశ్వర విగ్రహం చూశాము. మైసూరు ప్యాలెస్ ముందు మా బృందం ఫోటోలు దిగడం ఆనందంగా అనిపించింది. విశ్వేశ్వరయ్య మ్యూజియం, బెంగళూరు ప్యాలెస్, బృందావన్ గార్డెన్ సందర్శించాము. ప్రకృతి సౌందర్యం, శిల్పకళ మాకు విశేష అనుభూతి ఇచ్చాయి. ఈ యాత్ర మా జీవితాల్లో చిరస్మరణీయంగా నిలిచింది.

శతకం

# వేమన పద్యాలు

**నీళ్లలోన మీను నెరమాంస మాశించి**
**గాలపందుఁ జిక్కు కరణి భువిని**
**ఆశదగిలి నరుడు అలాగే చెడిపోవు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : నీటిలో చేప ఎరగానున్న మాంసానికి ఆశపడి గాలానికి చిక్కుకున్నట్లుగా భూమిపై నరుడు ఆశచేత ఆ చేప వలె చెడిపోవుచున్నాడు.

**ఆశ చేత మనుజులాయువు గలవాళ్లు**
**తిరుగుచుంద్రు భ్రమనుఁ ద్రిప్పలేక**
**మురికిభాండమందు ముసురునీగల భంగి**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : ఆయుస్సు వున్నంత కాలం మనుషులు ఆశ వదల లేక కాలము గడుపుచుందురు. మురికి కుండలో ఈగలు ముసిరినట్లే వారు తిరుగుతుంటారు.



# అన్నా చెల్లెళ్ళు

## అలెక్సేయ్ తొలెస్తోయ్



అనగనగా ఒక ఊరిలో ఓ నీటి దెయ్యం కొలనులో నివసించేది.

అది వేసవి కాలం. రాత్రిళ్ళు ఆ నీటి దెయ్యం కొలనులో ఉన్న చెట్ల తొర్రలో జీవించేది.

ఆ కొలను పక్కన ఒక చిన్న గుడిసెలో ఇవాన్, మరియా ఉండేవారు.

వాళ్లు అన్నాచెల్లెళ్ళు. రాత్రివేళ చంద్రుడు కొలను మీదకు వచ్చినప్పుడు నీటి దెయ్యం, పెద్ద గడ్డంతో, నల్లటోపీ పెట్టుకొని పైకి వచ్చేది.

"మరియా, నువ్వు జాగ్రత్తగా వుండాలి. లేదా నీటి దెయ్యం నిన్ను నీళ్ళలోకి లాగేస్తుంది" అని హెచ్చరించేవాడు ఇవాన్.

"నేను ఇంట్లో లేనప్పుడు, రాత్రివేళ అసలు గడప దాటి బయటకు వెళ్ళొద్దు, పాటలు పాడవద్దు, బుజ్జి ఎలుకలా ఇంట్లోనే ఉండు" అని జాగ్రత్తలు చెప్పేవాడు ఇవాన్.

"అలాగే అన్నయ్యా" అంది మరియా.

ఆహారం కోసం ఇవాన్ అడవిలోకి వెళ్ళాడు. రోజంతా ఇంట్లో వుండి మరియాకు విసుగు పుట్టింది. ఇలా పాట పాడటం మొదలుపెట్టింది.

**ఓ బంగారు చంద్రుడా!**
**కొలనుపై నువ్వు నడవలేవా?**
**ఈ కొలనులోకి చూడు**
**పువ్వులతో ఎంత అందంగా వుందో!**

ఉన్నట్టుండి తన భుజాన్ని ఎవరో తట్టినట్లనిపించింది మరియాకు.

"ఎవరు?" గట్టిగా అరిచింది.

"మా వద్దకు రా...! మా వద్దకు రా...! నీవే మా యువరాణివి" అన్న గుసగుసలు వినిపించాయి.

గుడిసె బయటకు వచ్చి చూసింది. కొలను నుంచి తన గుడిసె దాకా రంగు రంగుల చిత్ర విచిత్రమైన అందమైన పూలు ఒక దారిలా పరిచివున్నాయి. అవి నవ్వుతున్నాయి, ఆడుకుంటున్నాయి. మరియా భయంతో అరిచింది. తప్పించుకోవాలని ప్రయత్నించింది. కాని లాభం లేకపోయింది. అవి పూల కిరీటాన్ని మరియా తలపై పెట్టాయి.

ఉన్నట్టుండి పూల వెనుక నుండి నీటిదెయ్యం ప్రత్యక్షమయ్యింది.

"మరియా! నీకోసం నేను ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నాను" అంటూ ఆ దెయ్యం తన పొడవైన చేతులతో మరియాను బంధించింది.

ఉదయాన్నే ఇవాన్ ఇంటికి వచ్చాడు. తన ముద్దుల చెల్లెలు మరియా కనిపించలేదు. చుట్టుపక్కలంతా వెతికాడు. చివరికి కొలను బయట మరియా చెప్పులు కనిపించాయి.

పాపం ఇవాన్, ఎంతో ఏడ్చాడు.

కొన్ని రోజుల తర్వాత. 'వేరే చోటికి వెళ్లి బతుకుతాను' అని తనలో తాను గొణుక్కున్నాడు ఇవాన్.

బూట్లు పాడయిపోయాయి. కొత్త బూట్లు తయారు చేసుకోవడానికి కొలను వద్ద ఉన్న నిమ్మచెట్టు బెరడును వొలిచాడు. బూట్లు తయారుచేసుకున్నాడు.

ఇంటికి బయలుదేరాడు. ఎంత నడిచినా చివరికి ఆ నిమ్మచెట్టు వద్దకే వస్తున్నాడు. ఇది ఖచ్చితంగా మంత్రాల పనే అనుకున్నాడు. ఇవాన్‌కి కోపం వచ్చింది. తన ఒరలోని గొడ్డలితో నిమ్మచెట్టుని నరకబోయాడు.

"అన్నయ్యా! నన్ను నరకొద్దు" అన్న మాటలు నిమ్మ చెట్టు నుండి వినిపించాయి. "చెల్లెమ్మా! ఇది నువ్వా?" అని ఏడ్చాడు ఇవాన్.

"అవునన్నయ్యా నేనే, ఆ నీటి దెయ్యం నన్ను బలవంతంగా పెళ్ళి చేసుకొని చెట్టులా మార్చింది" అంది మరియా.

"మరి నీకు శాపవిమోచనం లేదా?" అడిగాడు ఇవాన్.

"ఒక మార్గముంది. ఆకాశంలోని మంత్రపుష్పాన్ని సంపాదిస్తే, నేను తిరిగి మానవ రూపంలోకి మారతాను" అంది మరియా.

సరే అని బయలుదేరాడు ఇవాన్.

అతని బూట్లు అలవోకగా అతన్ని ఆకాశంపైకి లాక్కెళ్ళాయి. ఆకాశంలో మేఘాల వెనక, తన భుజాన్ని ఎవరో తట్టినట్టు అనిపించింది. తిరిగిచూస్తే ఓ బలమైన మరుగుజ్జు కనిపించాడు. ఇవాన్ తన కథ చెప్పి మంత్రపుష్పం గురించి అడిగాడు.

"నాతో యుద్ధం చేసి గెలిస్తే, మంత్రపుష్పం నీదే" అన్నాడు మరుగుజ్జు.

ఇద్దరి మధ్య భీకరమైన పోరు జరిగింది.

చివరికి ఇవాన్ గెలిచాడు.

మంత్రపుష్పం సాధించాడు.

కొలనువద్దకు వచ్చి, నీటి దెయ్యం మొహంమీద మంత్రపుష్పంతో కొట్టాడు. నీటి దెయ్యం పొట్టపగిలి, చచ్చి, కొలనులో కలిసిపోయింది.

నిమ్మచెట్టు మరియాలా మారిపోయింది. అన్నా చెల్లెళ్ళు ఆనందంతో కౌగిలించుకున్నారు.



ఈ రోజుకీ వాళ్ళు కలిసే జీవిస్తున్నారు. ఇదండీ పిల్లలూ! అన్నా చెల్లెళ్ళ అనుబంధం.

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 81792 73971

ఇంగ్లీష్ : ఇవాన్ అండ్ మరియ
రచయిత : అలెక్సేయ్ తొలెస్తోయ్
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డియన్




# తెలుగు పండుగలకు ఆది ఉగాది

**తాత:** తేజా?! ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్? మీ స్కూల్‌లో మళ్లీ ఏదైనా కొత్త ప్రాజెక్ట్ మొదలెట్టారా?!

**తేజ:** అదేం లేదు తాతగారు. మీరు ఇష్టపడే పండుగ ఈ నెలలోనే రాబోతుంది కదా?! దాని గురించే అడగాలని అనుకుంటున్నాను.

**తాత:** నేను ఇష్టపడటం ఏమిటి? వెరైటీగా అది తెలుగు వారి అందరి పండుగ. నువ్వు తెలుగు వాడివి కాదా? ఆ ఉగాది పండుగ నీది కాదా?

**తేజ:** అయ్యో ఎంత మాట తాత నేను నీ మనవడిని నీ తెలుగు భాష వారసుడిని

**తాత:** సంతోషించాములే గాని ముందు పండుగనాడు మీ వాట్సప్ శుభాకాంక్షల తీరు మార్చుకోండి. నిక్షేపంగా నిండు తెలుగు పండుగ ఉగాది నాడు కూడా హ్యాపీ ఉగాది. సేమ్ టుయూ... అంటూ మీ భాషా బానిసత్వం చాటుకోకండి.

**తేజ:** క్షమించండి తాతయ్యా నేను ఎప్పుడూ అలా భాష బానిస పనులు చేయను.

**తాత:** మన దేశానికి గల పాలనపరమైన బానిస సంకెళ్లు తెంచి స్వరాజ్యం తెచ్చి మీ చేతుల్లో పెట్టాము. కాని కనిపించని భాష సంస్కృతుల పరాయితత్వపు బానిసత్వాన్ని మీ తరం ఇంకా వదిలించుకోలేదు బానిస బ్రతుకులు కొనసాగిస్తున్నారు.

**తేజ:** నిజమే తాతయ్య మా తరం చేస్తున్న తప్పులు ఒప్పుకుంటాను. మీరు ఆశించే భాష, సంస్కృతుల స్వరాజ్యం సాధిస్తాము. అసలు ఏది మనది ఏది పరాయిది తెలుసుకుని తెలివిగా నడుచుకుంటాం. మరి మన తెలుగు వారి తొలి పండుగ ఉగాది గురించి వివరంగా చెప్పు తాత!

**తాత:** నిజానికి ఇది "యుగాది" అంటే నూతన యుగానికి కాలానికి "ఆది" అని అర్థం కాలక్రమంలో యుగాది ఉగాదిగా రూపాంతరం చెందింది.

**తేజ:** ఇది మన తెలుగు వారు మాత్రమే చేసుకునే పండుగా? ఇంకా ఎవరైనా చేసుకుంటారా?

**తాత:** కర్నాటక, మహారాష్ట్ర, కేరళ తదితర ప్రాంతాలలో వివిధ రకాల పేర్లతో జరుపుకుంటారు. ప్రాంతాలను బట్టి పేర్లు మారినా మనుషులను బట్టి పండుగ చేసుకునే తీరు వేరు అయినా అన్నీటికీ అర్థాలు, పరమార్థాలు ఒక్కటే. పండుగనాడు చేసే ప్రత్యేక పనులు ద్వారా విజ్ఞాన శాస్త్ర సంబంధమైన ఆరోగ్యం, సామాజిక శాస్త్ర సంబంధపు సాకారం, చేయూత, సమభావనలు కలుగుతాయి అన్నది నిజం.

**తేజ:** అసలు ఉగాది పండుగ చేసుకోవడానికి నైవేద్యం

ఏమిటి? అదే సమయంలో ఖచ్చితంగా పండుగ చేసుకోవాలి అనే నియమం ఏమిటి?

తాత: మీరు ప్రస్తుతం వ్యవహరిస్తున్న ఇంగ్లీషు నెలలు లాగే మనకు తెలుగు నెలలు వుంటాయని నీకు తెలుసా?

తేజ: (నవ్వుతూ) భలేవాడివి తాత నువ్వే చెప్పావు వచ్చేదాక కంఠతా పట్టించావుగా?! ఎలా మర్చిపోతాను. చైత్రం, వైశాఖం, జేష్టం...

తాత: సంతోషం బాగానే గుర్తు పెట్టుకున్నావ్!! "సూర్య సిద్ధాంతం" ఆధారంగా వ్రాసిన జ్యోతిష గ్రంథంలో చెప్పినట్టు ఈ సృష్టికి కారకుడైన బ్రహ్మ తన సృష్టికార్యాన్ని సంవత్సరాలలో మొదటిది ప్రభవ మాసాలలో మొదటిది "చైత్రం". ఋతువులలో మొదటిది 'వసంతం' వారాలలో మొదటిది ఆదివారం, మొదటి తిథి పాడ్యమి. మొదటి నక్షత్రం "అశ్విని" రోజున ఈ యావత్తు సృష్టిని తయారు చేసాడని చెబుతారు.

తేజ: అలాగా!! మరి ఇన్ని విలువలు ప్రాధాన్యతలు కలిగిన ఈ ఉగాది అనబడే సంవత్సరాది పండుగను ఎలా జరుపుకుంటారో చెప్పండి.

తాత: పండగనాడు సూర్యోదయానికి ముందే శరీరానికి నవ్వుల నూనె పెట్టి కుంకుడు కాయరసంతో తలస్నానం చేసి కొత్త బట్టలు ధరించి పెద్ద వారి ఆశీస్సులు తీసుకుని దగ్గరలోని దేవాలయానికి వెళ్లి దైవదర్శనం చేసుకుని ఉగాది పచ్చడి తిన్న తరువాతే ఇతర వంటకాలు తినాలి.

తేజ: ఈ పండగకు ప్రత్యేకం – ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం కదా తాతయ్యా?!

తాత: ఔను ఈ ఉగాది పచ్చడి కేవలం ఆచారం కోసమే కాదు ఎంతో ఆరోగ్యం కూడా!

తేజ: ఉగాది పచ్చడి ఎలా తయారు చేస్తారు?!

తాత: కొత్త చింతపండు, మామిడి పిందేలు, కొత్త బెల్లం, వేపపూత, మిరియాలు, ఉప్పు వంటి ప్రధానమై ఆరు రుచుల పదార్థాలను మిశ్రమం చేసి తగినన్ని నీళ్ళు కలిపి ఈ ఉగాది పచ్చడి తయారు చేసి దేవుని పూజలో నైవేద్యంగా పెట్టి తరువాత పవిత్రంగా ఇంట్లో వారంతా ఆరగిస్తారు.

తేజ: కేవలం వాటితోనే ఎందుకు చేయాలి. ఇంకా బోలెడు రకాల పదార్థాలున్నాయి కదా?!

తాత: ఈ ఆరు రకాల పదార్థాలు చక్కటి ఔషధ గుణాలు కలిగివుండి ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాదు వేసవి కాలంలో వచ్చే రోగాలు రాకుండా చేయడమేగాక మనిషి జీవితంలో ఎదురయ్యే ఆనందం, బాధలు, కోపం, తదితర గుణాలను సమానంగా స్వీకరించే శక్తి మనకు అలవాటు కావాలనే ఉద్దేశంతోనే ఈ ఉగాది పచ్చడి తింటారని మన పెద్దలు చెబుతారు.

తేజ: వావ్! ఉగాది పచ్చడి మీద బోలెడు కార్టూన్లు జోక్‌లు చూసాను. కాని దీనిలో ఇన్ని లాభాలున్నాయా?! మరి "పంచాంగ శ్రవణం" మాటేమిటి?! దీనిమీద కూడా బోలెడు జోక్స్ ఉన్నాయిలెండి?!

తాత: దేనిదైనా విలువ తెలియకపోతే అలాగే వుంటుంది. ఇంక పంచాంగ శ్రవణం పండగనాడు సాయంత్రం పూట గ్రామదేవాలయం వద్దో కూడలి దగ్గరో గ్రామస్తులంతా కూడా పంచాంగం పట్ల అవగాహన గల పురోహితుని ద్వారా ఆ ఏడాది రాబోయే పండుగలు గృహణాలు, పుష్కరాలు తదితర భౌగోళిక జ్యోతిష్య సంబంధ విషయాలు భవిష్యత్ కాల పరిస్థితులను తెలుసుకుని తద్వారా భావి ప్రణాళికలు వేసుకుని మన జీవితం కొనసాగించవచ్చు.

తేజ: బాగుంది...! అసలు "పంచాంగం" అంటే అర్థం ఏమిటి?

తాత: నీకు భలే చిత్రమైన సందేహాలు వస్తాయే! 'పంచాంగం' అంటే ఐదు అంగములు కలది అని అర్థం జ్యోతిష శాస్త్రంలో తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణము అనే ఈ ఐదు అంశాలు ప్రాధాన్యతను కలిగి వుంటాయి. ఈ ఐదింటిలో ఏవైనా మూడు ఉత్తమంగా ఉంటే దానిని "ముహూర్తం"గా నిర్ణయించి పనులు ప్రారంభించడం మన తెలుగు వారికి ఆచారం.

తేజ: బాగుంది తాతగారు మన తొలి పండుగ సంవత్సరాది అయిన ఉగాది జరుపుకోవడంలో ఇన్ని లాభాలు, విశేషాలు, ఆరోగ్యాలు నిండి ఉన్నాయన్న మాట! చాలా చాలా సంతోషం ధన్యవాదాలు.

తాత: శుభం... నీకు మీ మిత్రులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు.

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

చరిత్ర పాఠాలు-13


# రెండు వేల ఏండ్ల కిందటి భాషా సాహిత్యాలు





నాటి బ్రాహ్మణ ఆశ్రమాలు, బౌద్ధ, జైన విహారాలు, వృత్తి (శ్రేణి) సంఘాలు మత, లౌకిక విద్యలను బోధించేవి. ధాన్యకటకంలో, శ్రీపర్వతంలో విశ్వవిద్యాలయాలుండేవి. ధాన్యకటకం విశ్వవిద్యాలయం లాగానే లాసాలో విశ్వవిద్యాలయం ఏర్పాటయిందని టిబెటన్ల సాహిత్యం తెలియజేస్తుంది. శాతవాహన యుగంలో ప్రాకృతం, పైశాచీ, పాళీ, సంస్కృత భాషలలో అపార సాహిత్యం వెలువడింది. దేశీ (తెలుగు) భాషల్లో మౌఖిక సాహిత్యం (పాటలు, గేయాలు) ఉన్నట్లు నాటి గ్రంథం "గాథాసప్తశతి" వల్ల తెలుస్తుంది. నాటి సామాన్య ప్రజల భాష దేశి. నాటి దేశి ద్రావిడ భాష నుండి విడివడి క్రమంగా తెలుగు భాషగా రూపొందిందని భాషా శాస్త్రజ్ఞులు అంటారు. పైశాచీ మాండలికం నాటి దేశీ భాషా సంబంధితం. ఆ భాషలో గుణాఢ్యుడు 'బృహత్కథ' అనే గ్రంథాన్ని కూడా వెలువరించాడు. అయితే శాతవాహనుల నాటి రాజభాష మాత్రం ఉత్తర భారత ప్రాంత ప్రభావితమైన ప్రాకృత భాష. ఇది దక్షిణ ప్రాకృతం అనీ, మహారాష్ట్రీ ప్రాకృతం అనీ, తెలుగు ప్రాకృత మాండలికం అనీ భిన్నాభిప్రాయాలున్నాయి. ఏమైనప్పటికీ ప్రాకృతం తెలుగునీ, తెలుగు ప్రాకృతాన్నీ పరస్పరం ప్రభావితం చేసుకున్నాయి. క్రీ.శ. 12వ శతాబ్దపు హేమచంద్రుని 'దేశి నామమాల' ప్రాకృతంలో అనేక తెలుగు పదాలున్నాయని పేర్కొంది. ఒక్క గాథాసప్తశతిలోనే అత్తా, పొట్ట, తుప్ప (నేయి), సరఅస్స (చెఱకు), రంప, మఇల (మైల), అవ్వో (అమ్మో), చోజ్జ (చోద్యం), వేంట (పత్తి) వంటి 40కి పైగా తెలుగు పదాలున్నాయని ప్రసిద్ధ పండితులు తిరుమల రామచంద్ర గుర్తించారు. అలాగే చీమకుర్తి శేషగిరిరావు తెలుగులో గల అమ్మ, సుత్తి (సుద్ధి), సుక్క (చుక్క), మరియాద, మిళ్ల (మైల), స్థల (నాగలి) లాంటి 239 పాళీ పదాలున్నాయని గుర్తించారు. శాతవాహన రాజు పేరు పులుమావి కూడా తెలుగు పదం. పులు అంటే గడ్డి, మావి అంటే తల్లి మాయ. అనగా గడ్డిలో జన్మించినవాడు (శరజన్మన్) స్కంధుడు/ కార్తికేయుడు/ కుమార స్వామి అని అర్థం. గౌతమీపుత్ర శాతకర్ణి కాలం నుండి వెలువడిన శాతవాహన వెండి నాణేలపై ప్రాకృత, దేశీ భాషలు రెండింటి రాతలున్నాయి. శాతవాహన రాజుల శాసనాలన్నీ బ్రాహ్మీ లిపిలో ప్రాకృత భాషలో ఉన్నప్పటికీ కుంతల శాతకర్ణి కాలం నుండి సంస్కృతం రాజభాష అయినట్లు తెలుస్తుంది. నాటి నుంచి కావ్యాలు సంస్కృతంలో వచ్చాయి. కొంతమంది పండితులు కూడా సంస్కృతంలో మాట్లాడినప్పటికీ ప్రజల భాష మాత్రం దేశీ భాషయైన తెలుగే. హాలుని కాలం (ఒకటవ శాతాబ్దం) నుండే కావ్యరూప సాహిత్యం కనిపిస్తున్నది. 'కవి వత్సలు'డైన హాలుని ప్రాకృత కావ్యం గాథాసప్తశతిలో 700 గాథలు ఉన్నాయి. ఆయన రాజ్యం / ఆస్థానంలోని ఎంతోమంది కవులు, కవయిత్రులు వాటిని రచించారు. ఆ కావ్యంలో గ్రామీణ వాతావరణంలో అనేక వృత్తులకు చెందిన యువతీ యువకుల మధ్య ఉన్న ప్రేమ / శృంగారం వాస్తవికంగా వర్ణించబడింది. కుంతల శాతకర్ణి, శర్వవర్మ కథలతో గుణాఢ్యునికి సంబంధమున్నట్లు కనిపిస్తున్నా గుణాఢ్యుడు తను పైశాచీ మాండలిక భాషలో రాసిన 'బృహత్కథ'ను శాతవాహన రాజుకు (హాలునికి) అంకితమిచ్చినట్లు రాశాడు. అయితే అందులోని లంబకాలు (అధ్యాయాలు) అన్నీ నశించిపోయి ప్రస్తుతం ఒక్క లంబకం మాత్రమే... అది కూడా సోమదేవభట్టు సంస్కృతంలోకి అనువదించిన 'కథా సరిత్సాగరం' రూపంలో లభ్యమవుతున్నది. బృహత్కథ రామాయణ మంతటి కావ్యం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పంచతంత్ర కథలకు అది మూలం. ఇక హాలుని వివాహంపై ప్రాకృతంలో ఒక అజ్ఞాతకవి (కుతూహలుడు) 'లీలావతి' కావ్యాన్ని రాశాడు. బౌద్ధుల గ్రంథాలు కూడా ప్రాకృతంలో రాయబడ్డాయి. కుంతల శాతకర్ణి కోసం శర్వవర్మ రాసినట్లు చెప్పుతున్న సంస్కృత వ్యాకరణం 'కాతంత్ర వ్యాకరణం'. ఇది ఆరు నెలల్లో సులభంగా సంస్కృతం నేర్చుకోవడానికి ఉపకరిస్తుందట. మహాయాన బౌద్ధులు సంస్కృతంలోనే రచనలు చేశారు. ఆచార్య నాగార్జునుని ప్రజ్ఞా పారమిత, సుహృల్లేఖ మొదలైన గ్రంథాలు సంస్కృత రచనలు. అతడు 'రత్నావళీ – రాజపరికథ'లో "శ్రేయోరాజ్య" సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. అతని సుహృల్లేఖను ప్రతి విద్యార్థి కంఠస్థం చేసేవాడని చైనా యాత్రికుడు ఇత్సింగ్ (7వ శతాబ్దం) పేర్కొన్నాడు. నాగార్జునుని రచనలను కొన్నింటిని చైనీస్ భాషలోకి అనువదించారు. అతడు శ్రీపర్వతం విశ్వవిద్యాలయంలో పెద్ద గ్రంథాలయాన్ని నిర్మించినట్లు మరో చైనా యాత్రికుడు ఫాహియాన్ పేర్కొన్నాడు. నాగార్జునుని అనంతరం ఆర్యదేవుని రచనలు కూడా సంస్కృతంలోనే వెలువడ్డాయి. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో ఉజ్జయిని నుండి వచ్చిన యాత్రికుడు అమరావతిలో వేయించిన శాసనంలో కూడా సంస్కృత ప్రభావం కనిపిస్తుంది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078



# కలంచెలిమి



**ఎం. అలేఖ్య**
10వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
భూదాన్ పోచంపల్లి



**పెద్ది రేవంత్**
10వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
కొలనూర్, కొనరావుపేట.



**యు. రుచిత**
9వ తరగతి,
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత
పాఠశాల, బీబీపేట.



**జోషిత్**
6వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
కల్లివెట్టు, తిరుపతి జిల్లా.



**ఎల్. వైష్ణవి**
7వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
ముత్యాల పేట, కవిటి మండలం,
శ్రీకాకుళం.



**డి. రసన్య**
10వ తరగతి, టి.జి.ఎం.ఎస్.,
స్టేషన్ ఘన్‌పూర్.

# అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లు...



ఇంటి కోడలిపై అత్త ఎప్పుడూ పెత్తనం చెలాయిస్తుంది. తను చెప్పిన పని చేయాలంటుంది. తన మాటను వినాలంటుంది. అమాయకురాలైన కోడలిని అణచాలనుకుంటుంది. తన మాట వినకపోతే అత్త తన ప్రతాపం చూపుతుంది. ఏదో ఒక వంకతో కోడలిని సూటి పోటి మాటలు అంటుంది. హింస పెడుతుంది.

కోడలు పిల్లకి తన తప్పేమిటో తెలియదు. అత్త తనను ఎందుకు సాధిస్తుందో అర్థం కాదు. పని ఎంత బాగా చేసినా అత్త వంకలు పెడుతుంది. అత్తను ఎదిరించే ధైర్యం కోడలుకి లేదు. ఆమె దూషణలు తప్పించుకునే దారి లేదు. ఏం చేయాలో తోచలేదు. అత్త మీద పీకల వరకు కోపం. అణచుకో లేక పోయింది.

విరామం లేకుండా పని చేస్తుంటే తిట్లు మొదలయ్యాయి. కోడలుకి అత్తను చంపేయాలన్నంత కోపం వచ్చింది. సాహసం చేయలేదు.

అక్కసు ఆపుకోలేకపోయింది. శుభ్రం చేస్తున్న తన చేతిలోని మట్టి దుత్త (కుండ)ను దూరంగా విసిరి కొట్టింది. అత్త మీద కోపం దుత్త మీద చూపింది. దుత్త పగిలింది. నష్టం కలిగింది.

మరల అది కొనాలంటే డబ్బు కావాలి. కోడలి కోపం చల్లారినా, దాని వలన లాభం కంటే నష్టం ఎక్కువ. మనకి ఎవరి మీదైనా కోపం వస్తే అదుపులో పెట్టుకోవాలి.

ఆవేశంతో మనకి అందుబాటులో ఉన్న వస్తువుల మీద ఆ కోపం చూపితే నష్టపోయేది మనమే. అలాంటి సందర్భాలలోనే 'అత్తమీద కోపం దుత్త మీద చూపినట్లు' సామెతను వాడతారు.

– 'బాల కథా సౌరభం' నుండి...

# 111 తో అద్భుతం



1. ఏదైనా 3 అంకెల సంఖ్యను రాసుకోమనాలి.
2. దానిని 111తో గుణించుకోమనాలి.
3. ఇప్పుడు వారు తీసుకున్న 3 అంకెల సంఖ్యను చెప్పమనాలి.
4. అది విని వారి జవాబును వెంటనే చెప్పాలి.

**ఉదా :** **673 × 111 = 74703**

**495 × 111 = 54945**

**786 × 111 = 87246**

క్లూ చెప్పిన అంకెలోని ఒకట్ల స్థానం జవాబులో యధాతథంగా రాయాలి.

ఒకట్ల పదుల స్థానాలను కూడాలి.

ఒకట్ల పదుల వందల స్థానాలను కూడాలి.

పదుల వందల స్థానాలను కూడాలి.

**673 × 111 = 3 ఒకట్ల స్థానం 7+3=10, 0 పదుల స్థానం 1 క్యారి**

**6+7+3+1=17 వందల స్థానం 1 క్యారి**

**6+7+1=14, 4 వేల స్థానం 1 క్యారి**

**6+1=7, 7 పదివేల స్థానం**

## BEAUTY NUMBER

77 x any 2 digits x 13

77 x 9 x 13 = 0909

77 x 18 x 13 = 18018

77 x 27 x 13 = 27027

77 x 36 x 13 = 36036

77 x 45 x 13 = 45045

77 x 54 x 13 = 54054

77 x 63 x 13 = 63063

77 x 72 x 13 = 72072

77 x 81 x 13 = 81081

– అంకెల మామయ్య చంద్రయ్య

m: 9440926937



# చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------

తండ్రి పేరు : ------------------

పుట్టినతేదీ : ------------------

చిరునామా : ------------------

------------------

------------------

పిన్ : ------------------

హాబీలు : ------------------

మొబైల్ : ------------------

ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ : desk.chelimi@gmail.com









# క్లౌడ్ మరియు ఎడ్జ్ కంప్యూటింగ్‌లో ఎఐ పాత్ర

## (స్మార్ట్ సిటీల నుంచి స్మార్ట్ ఫోన్ల వరకు)

నేటి సమాచార సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు (Artificial Intelligence - AI) మానవ జీవితాన్ని వేగంగా మారుస్తున్న ప్రధాన శక్తిగా నిలిచింది. ఈ AI సామర్థ్యాన్ని మరింత ప్రభావవంతంగా వినియోగించడానికి క్లౌడ్ కంప్యూటింగ్ మరియు ఎడ్జ్ కంప్యూటింగ్ అనే రెండు విధానాల సమ్మేళనం ఏర్పడింది. దీనినే క్లౌడ్ + ఎడ్జ్ AI లేదా హైబ్రిడ్ AI సిస్టమ్‌గా వ్యవహరిస్తున్నారు.

### క్లౌడ్ + ఎడ్జ్ AI అంటే ఏమిటి?

క్లౌడ్ + ఎడ్జ్ AI అంటే AI పనిని ఒకే చోట నిర్వహించకుండా, అవసరాన్ని బట్టి రెండు స్థాయిల్లో పంచుకొని చేయడం. డేటా పుట్టే పరికరాల దగ్గరే జరిగే వేగవంతమైన నిర్ణయాలు ఎడ్జ్ AI ద్వారా జరుగుతాయి. భారీ లెక్కలు, డేటా నిల్వ, AI మోడళ్ల ట్రైనింగ్ వంటి భారమైన పనులు క్లౌడ్ AIలో జరుగుతాయి. ఈ విధానం వేగం, సామర్థ్యం, భద్రత అన్నింటినీ సమతుల్యం చేస్తుంది.

### క్లౌడ్ కంప్యూటింగ్ పాత్ర


క్లౌడ్ కంప్యూటింగ్ అనేది ఇంటర్నెట్‌లో ఉన్న భారీ సర్వర్ల ద్వారా కంప్యూటింగ్ సేవలను అందించే విధానం. Google Cloud, Amazon Web Services, Microsoft Azure వంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా క్లౌడ్ సేవలను అందిస్తున్నాయి.

క్లౌడ్‌లో AI పెద్ద మోడళ్లను ట్రెయిన్ చేయడం, కోట్లాది డేటాను విశ్లేషించడం, క్లిష్టమైన గణనలను చేయడం వంటి పనులు చేస్తుంది. వాతావరణ అంచనాలు, వైద్య పరిశోధనలు, భాషా అనువాద వ్యవస్థలు వంటి వాటిలో క్లౌడ్ AI కీలకంగా ఉంటుంది.

### ఎడ్జ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యత

ఎడ్జ్ కంప్యూటింగ్‌లో AI డేటా పుట్టే చోటే పని చేస్తుంది. మొబైల్ ఫోన్లు, CCTV కెమెరాలు, సెన్సర్లు, స్మార్ట్ మెషిన్లు, కార్లు వంటి పరికరాలు ఎడ్జ్ ఉదాహరణలు.

ఇక్కడ AI వెంటనే స్పందించగలుగుతుంది. ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోయినా పని చేయగల సామర్థ్యం ఉండడం, వ్యక్తిగత డేటా పరికరంలోనే ఉండటం వల్ల గోప్యత మెరుగ్గా ఉండటం ఎడ్జ్ AI యొక్క ప్రధాన లాభాలు.




### హైబ్రిడ్ AI విధానం ఎలా పని చేస్తుంది?

హైబ్రిడ్ AI వ్యవస్థలో ఎడ్జ్ AI ముందుగా డేటాను సేకరించి తక్షణ నిర్ణయాలు తీసుకుంటుంది. అవసరమైన ముఖ్యమైన సమాచారం మాత్రమే క్లౌడ్‌కు పంపుతుంది. క్లౌడ్ AI ఆ డేటా నుంచి నేర్చుకొని మోడళ్లను మెరుగు పరుస్తుంది. ఆ మెరుగైన మోడళ్లను తిరిగి ఎడ్జ్ పరికరాలకు అప్డేట్‌ల రూపంలో పంపుతుంది. ఈ నిరంతర ప్రక్రియ వల్ల వ్యవస్థ మరింత ఖచ్చితంగా, సమర్థంగా మారుతుంది.

### ఉపయోగాలు

క్లౌడ్ + ఎడ్జ్ AI అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగంలో ఉంది. స్వయంచాలక వాహనాల్లో ఎడ్జ్ కెమెరాలు అడ్డంకులను వెంటనే గుర్తిస్తే, క్లౌడ్ కోట్ల డ్రైవింగ్ డేటాతో నేర్చుకుంటుంది. వైద్య రంగంలో వేరబుల్స్ ద్వారా హార్ట్ రేట్, ఆక్సిజన్ లెవెల్స్ ఎడ్జ్‌లో కొలవబడతాయి, క్లౌడ్‌లో దీర్ఘకాల విశ్లేషణ జరుగుతుంది. స్మార్ట్ ఫ్యాక్టరీలు, స్మార్ట్ స్కూల్స్, స్మార్ట్ సిటీలు, మొబైల్ యాప్‌లు అన్నింటిలోనూ ఈ టెక్నాలజీ కీలకంగా మారింది.

### ప్రయోజనాలు మరియు సవాళ్లు

ఈ విధానం వేగవంతమైన స్పందన, తక్కువ ఇంటర్నెట్ ఖర్చు, మెరుగైన గోప్యత, రియల్ టైమ్ నిర్ణయాలు వంటి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అయితే పరికరాల శక్తి పరిమితి, భద్రత నిర్వహణ, సిస్టమ్ డిజైన్ క్లిష్టత, తరచు AI మోడల్ అప్డేట్స్ వంటి సవాళ్లు కూడా ఉన్నాయి.

### ముగింపు

మొత్తంగా, క్లౌడ్ + ఎడ్జ్ కంప్యూటింగ్‌లో కృత్రిమ మేధస్సు అనేది భవిష్యత్తు సాంకేతికత. వేగం, శక్తి, భద్రతలను సమతుల్యం చేస్తూ ఇది విద్య, పరిశ్రమ, వైద్యం, పాలన వంటి అన్ని రంగాల్లో సమాజ అభివృద్ధికి దోహదపడుతోంది.

– లత

e: ogshydcbse@gmail.com

19.02.2026న జరిగిన భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్-2026 కథానిక పోటీ విజేతలకు బహుమతీ ప్రదానోత్సవ సభ జరిగింది. ఆ సభలో ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ సి. మృణాళిని గారు పాల్గొని ప్రసంగిస్తూ వేదకుమార్ నిర్వహిస్తున్న దక్కన్ ల్యాండ్ మరియు బాలచెలిమి పత్రికల సేవలను ప్రశంసించారు. దక్కన్ ల్యాండ్‌లో ప్రచురితమయ్యే చరిత్ర వ్యాసాలు రచయితలకు ప్రేరణనిస్తాయని చెప్పారు. నాణ్యతతో పత్రిక నడపడం కష్టం అయినప్పటికీ సమాజ ప్రయోజనార్థం కొనసాగించడం గొప్ప సేవ అన్నారు. తెలుగు బాలసాహిత్యం ఇతర భాషలతో పోలిస్తే వెనుకబడి ఉందని, బాలచెలిమి పిల్లల్లో ఆలోచనాశక్తి, సృజనాత్మకత పెంచుతుందని అన్నారు. సంస్కారం, అభిరుచి వంటి విలువలను సాహిత్యం ద్వారా పిల్లలలో పెంచడం అవసరమని పేర్కొంటూ, ఈ ప్రయత్నాలు కొనసాగాలని ఆకాంక్షించారు.



– దక్కన్ న్యూస్

# కాకి గులకరాళ్ళు



అది తీవ్రమైన ఎండా కాలంలో ఓ రోజు. అడవిలోని చెరువు నీరు లేక పూర్తిగా ఎండిపోయింది. కాకి దాహంతో అలమటిస్తూ ఆకాశంలో ఎగురుతూ నీటి కోసం వెతుకుతూ ఉంది. చాలా దూరం ఎగిరిన తరువాత, ఒక ఊరిలో చిన్న ఇల్లు దగ్గరగా ఒక మట్టి కుండ కనిపించింది. ఆనందంతో కాకి అక్కడికి చేరింది. కుండలోకి తొంగిచూసింది. కుండ అడుగున కొద్దిగా నీరు కనిపించింది. కానీ కుండ పొడవుగా ఉండటంతో, కాకి తన ముక్కుతో నీటిని అందుకోలేక పోయింది. మొదట అది నిరాశ చెందింది. “ఇక్కడే నీరు ఉంది, కానీ ఎలా తాగాలి?” అని ఆలోచించింది. కొద్దిసేపు ఆలోచించిన తరువాత, కాకికి ఒక మంచి ఆలోచన వచ్చింది. చుట్టూ చూసింది. అక్కడ చిన్న చిన్న రాళ్లు కనిపించాయి. కాకి ఒక రాయి తీసుకుని కుండలో వేసింది. రాయి నీటిలో పడగానే నీటి మట్టం కొంచెం పైకి వచ్చింది. ఆనందంతో మరో రాయిని తీసుకుని వేసింది. ఇలా ఒకటి తర్వాత ఒకటి రాళ్లు వేస్తూ పోయింది. కొంత సేపటి తరువాత, నీటి మట్టం క్రమంగా పైకి వచ్చి, చివరకు కుండ లోని నీరు నోటి దగ్గరికి చేరింది. ఇప్పుడు కాకి సులభంగా నీటిని తాగగలిగింది. దాహం తీరడంతో కాకి ఎంతో సంతోషించింది. తన తెలివితేటలకు తానే మెచ్చుకుంది. మళ్లీ ఉత్సాహంగా ఆకాశంలోకి ఎగిరింది.

### ఈ కథలో సైన్స్ ఏమిటి?

నీరు పైకి ఎలా వచ్చాయి?

“ఈ కథలో కాకి కుండలో ఉన్న నీటిని తాగడానికి రాళ్లు వేసే విధానం స్థాన భ్రంశం (Displacement) అనే భౌతిక శాస్త్ర సూత్రంపై ఆధారపడి ఉంది. ఒక వస్తువు ద్రవంలో పడినప్పుడు, అది తన పరిమాణానికి సమానమైన ద్రవాన్ని పైకి నెట్టుతుంది. ఇదే కారణంగా నీటి మట్టం పైకి పెరుగుతుంది. కుండలో మొదట నీరు తక్కువగా ఉండటంతో, కాకి ముక్కుతో నీటిని అందుకోలేకపోయింది. కానీ రాళ్లు వేసినప్పుడు ప్రతి రాయి నీటిలోకి వెళ్లి కొంత స్థలాన్ని ఆక్రమించింది. ఆ స్థలాన్ని భర్తీ చేయడానికి నీరు పైకి లేచింది. రాళ్ల సంఖ్య పెరిగే కొద్దీ నీటి మట్టం కూడా క్రమంగా పైకి వచ్చింది. చివరకు నీరు కుండ నోటికి దగ్గరికి చేరి, కాకి తాగగలిగింది.



### ఆర్కిమీడీస్ సూత్రంతో సంబంధం

"ఈ సూత్రం ప్రకారం, ఒక వస్తువు ఒక ద్రవం (ప్రవాహి)లో పూర్తిగా లేదా కొంతమేర ముంచినప్పుడు, ఆ వస్తువు తన వల్ల తొలగించిన ద్రవం యొక్క బరువుకు సమానమైన బలం ఆ వస్తువు పై ఊర్ధ్వ దిశలో కలిగిస్తుంది. అలాగే ద్రవం యొక్క స్థాయి మారుతుంది. కాకి రాళ్లను కుండలో వేయడం ప్రారంభించగా, ప్రతి రాయి నీటిలోకి పడినప్పుడు, అది తన పరిమాణానికి సమానమైన నీటిని పక్కకు నెట్టుతుంది. కుండలోని నీటి మట్టం క్రమంగా పైకి పెరుగుతుంది. ఇక్కడ ఆర్కిమీడీస్ సూత్రం పని చేస్తోంది. రాయి నీటిలో మునిగినప్పుడు, అది నీటిని తొలగిస్తుంది; తొలగించిన నీటి పరిమాణం కారణంగా నీరు పైకి లేచి, మట్టం పెరుగుతుంది. రాళ్ల సంఖ్య పెరిగే కొద్దీ స్థానచలనం కూడా పెరిగి, చివరకు నీరు కుండ నోటికి చేరుతుంది. అప్పుడు కాకి సులభంగా నీటిని తాగగలుగుతుంది.

### రాయి ఎందుకు నీటిలో మునుగుతుంది?

రాయి నీటిలో మునగడానికి ప్రధాన కారణం సాంద్రత (Density). రాయి యొక్క సాంద్రత నీటి సాంద్రత కంటే ఎక్కువగా ఉంటుంది. అందువల్ల రాయి నీటిలో వేస్తే, నీటి మీద తేలకుండా కిందకు మునుగుతుంది. అలాగే తేలే బలం (Buoyant Force) అనే శక్తి కూడా ఇక్కడ పని చేస్తుంది. నీరు ఏ వస్తువునైనా పైకి నెట్టే ప్రయత్నం చేస్తుంది. కానీ రాయి విషయంలో, నీరు ఇచ్చే తేలే బలం కంటే రాయి బరువు ఎక్కువగా ఉండటం వల్ల అది కిందకు మునుగుతుంది.

– కె శ్రీకృష్ణ సాయి
రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)
m : 9866130320

## సామెతలు

- అటుకులు బొక్కేనోరు, ఆడిపోవుసుకునే నోరు ఊరుకోవు.
- ఆదర్శాలు శిఖరమెక్కి కూర్చుంటే, అవసరాలు అగాధంలోకి ఈడుస్తాయి.
- ఇల్లలుక గానే పండుగవుతుందా?
- ఉత్త కుండకు ఊపులెక్కువ.
- ఊళ్ల అధికారమైనా ఉండాలి, ఊరంచు పొలమైనా ఉండాలి.
- ఎక్కువ తెలివి ఏడ్పుల కారణం, తక్కువ తెలివి తన్నుల కారణం.
- ఏట్లో పారే నీరు ఎవరు తాగితేనేమి?
- ఒక కల కనగానే తెల్లవారుతుందా?
- ఓ పనివాడు కోరనిదీ ఒంటరివాడు ఆడనిదీ లేదు.
- కంచె లేని చేను, కన్న తల్లి లేని బిడ్డ ఒకటే.

– బాలచెలిమి




# భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు

భారతదేశ ప్రాథమిక చట్టమైన భారత రాజ్యాంగం పౌరుల హక్కులు, స్వేచ్ఛలను రక్షిస్తూ ఒక ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది వేస్తుంది. రాజ్యాంగం ద్వారా రక్షణతో పాటు హామీ ఇవ్వబడిన హక్కులను ప్రాథమిక హక్కులు అని పిలుస్తారు. ఇవి రాజ్యాంగంలోని మూడవ భాగంలో (Part III), ఆర్టికల్ 14 నుండి ఆర్టికల్ 35 వరకు పొందుపరచబడ్డాయి. ఈ భాగాన్ని భారతదేశ మాగ్నా కార్టా అని కూడా వర్ణిస్తారు.

భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ప్రధానంగా అమెరికా రాజ్యాంగంలోని హక్కుల బిల్లు నుండి ప్రేరణ పొందాయి. భారత రాజ్యాంగం మొదటగా ఏడు ప్రాథమిక హక్కులను పొందుపరిచింది. అయితే కాలక్రమంలో జరిగిన రాజ్యాంగ సవరణల కారణంగా ప్రస్తుతం అవి ఆరు ప్రాథమిక హక్కులుగా కొనసాగుతున్నాయి. అవి క్రింది విధంగా ఉన్నాయి:

1. సమానత్వ హక్కు – (ఆర్టికల్స్ 14 నుండి 18 వరకు)
2. స్వేచ్ఛ హక్కు – (ఆర్టికల్స్ 19 నుండి 22 వరకు)
3. దోపిడీకి వ్యతిరేకంగా హక్కు – (ఆర్టికల్స్ 23 మరియు 24)
4. మత స్వేచ్ఛ హక్కు – (ఆర్టికల్స్ 25 నుండి 28 వరకు)
5. సాంస్కృతిక మరియు విద్యా హక్కులు – (ఆర్టికల్స్ 29 మరియు 30)
6. రాజ్యాంగ పరిష్కారాల హక్కు – (ఆర్టికల్స్ 32 నుండి 35 వరకు)

**గమనిక:**

ఆస్తి హక్కును 1978లో అమలైన 44వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించి, ప్రస్తుతం ఆర్టికల్ 300-A కింద ఒక చట్టబద్ధమైన హక్కుగా మార్చారు.

## ప్రాథమిక హక్కులు వ్యాసాలు

### 1. సమానత్వ హక్కు

(ఎ) ఆర్టికల్ 14 – చట్టాల సమాన రక్షణ మరియు చట్టం ముందు సమానత్వం.

(బి) ఆర్టికల్ 15 – మతం, కులం, లింగం, జన్మస్థలం లేదా జాతి ఆధారంగా వివక్షతను

నిషేధించడం.

(సి) ఆర్టికల్ 16 – ప్రభుత్వ ఉపాధి పరంగా అవకాశాల సమానత్వం.

(డి) ఆర్టికల్ 17 – అంటరానితనాన్ని రద్దు చేయడం మరియు దాని ఆచారాన్ని నిషేధించడం.

(ఇ) ఆర్టికల్ 18 – సైనిక మరియు విద్యా బిరుదులు తప్ప మిగిలిన బిరుదులను రద్దు చేయడం.

## 2. స్వేచ్ఛ హక్కు

(ఎ) ఆర్టికల్ 19 – స్వేచ్ఛకు సంబంధించి ఆరు హక్కుల రక్షణ:

- (i) ప్రసంగం మరియు వ్యక్తీకరణ,
- (ii) అసెంబ్లీ,
- (iii) సంఘం,
- (iv) కదలిక,
- (v) నివాసం, మరియు
- (vi) వృత్తి

(బి) ఆర్టికల్ 20 – నేరాలకు సంబంధించి నేరారోపణలో రక్షణ.

(సి) ఆర్టికల్ 21 – జీవిత రక్షణ మరియు వ్యక్తిగత స్వేచ్ఛ.

(డి) ఆర్టికల్ 21A – ప్రాథమిక విద్య హక్కు.

(ఇ) ఆర్టికల్ 22 – కొన్ని సందర్భాలలో అరెస్టు మరియు నిర్బంధం నుండి రక్షణ.

## 3. దోపిడీకి వ్యతిరేకంగా హక్కు

(ఎ) ఆర్టికల్ 23 – బలవంతపు శ్రమ మరియు మానవుల అక్రమ రవాణా నిషేధం.

(బి) ఆర్టికల్ 24 – కంపెనీలు మరియు కర్మాగారాలలో పిల్లలను నియమించడం నిషేధం, మొదలైనవి.

## 4. మత స్వేచ్ఛ హక్కు

(ఎ) ఆర్టికల్ 25 – మనస్సాక్షి స్వేచ్ఛ మరియు స్వేచ్ఛగా మతం ఆచరించడం, ఆచరించడం మరియు ప్రచారం చేయడం.

(బి) ఆర్టికల్ 26 – మతపరమైన వ్యవహారాల నిర్వహణ స్వేచ్ఛ.

(సి) ఆర్టికల్ 27 – ఏదైనా మతం లేదా మతపరమైన వ్యవహారాల ప్రమోషన్ కోసం పన్నుల చెల్లింపు నుండి స్వేచ్ఛ.

(డి) ఆర్టికల్ 28 – కొన్ని విద్యా సంస్థలలో మతపరమైన బోధన లేదా ఆరాధనకు హాజరు కాకుండా స్వేచ్ఛ

## 5. సాంస్కృతిక మరియు విద్యా హక్కులు

(ఎ) ఆర్టికల్ 29 – మైనారిటీల భాష, లిపి మరియు సంస్కృతి రక్షణ.

(బి) ఆర్టికల్ 30 – విద్యా సంస్థలను స్థాపించడానికి మరియు నిర్వహించడానికి మైనారిటీల హక్కులు.

## 6. రాజ్యాంగ పరిష్కారాల హక్కు

(ఎ) ఆర్టికల్ 32 – రిట్‌లతో సహా ప్రాథమిక హక్కుల అమలు కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కు

1. హెబియస్ కార్పస్,
2. మాండమస్,
3. నిషేధం,
4. సర్టియోరారి,
5. క్వో వారంటో


(బి) ఆర్టికల్ 33 – “సాయుధ దళాలు, పారామిలిటరీ దళాలు, పోలీసు దళాలు, నిఘా సంస్థలు మరియు సారూప్య దళాల సభ్యుల” ప్రాథమిక హక్కులను పరిమితం చేయడానికి లేదా రద్దు చేయడానికి పార్లమెంటుకు అధికారం కల్పిస్తుంది.

(సి) ఆర్టికల్ 34 – సైనిక చట్టం (సైనిక పాలన) అమలులో ఉన్నప్పుడు ప్రాథమిక హక్కులపై పరిమితులను అందిస్తుంది.

(డి) ఆర్టికల్ 35 – ప్రాథమిక హక్కులపై చట్టాలు చేయడానికి పార్లమెంటుకు అధికారం ఇస్తుంది.

– బాలచెలిమి డెస్క్

# పాలు పొంగకుండా...



ఎనిమిదవ తరగతి చదివే దీపక్ చురుకైన అబ్బాయి. పెద్దయ్యాక సైన్సు టీచర్ కావాలని కోరిక. ఆ రోజు తమ పల్లెలోని ఇంటి నుంచి బడికి బయలుదేరుతూ ఉన్నాడు. గుడ్డలుతుకుతున్న అమ్మ గట్టిగా అరిచింది. 'పొయ్యి మీద పాలు పెట్టాను. పాలు పొంగి, బూడిద పాలు కాకుండా చూడు. పొంగే సమయం చూసి దించేయ్' అని. బ్యాగు తలకు తగిలించుకుని పొయ్యి ముందర నిలబడ్డాడు. ఎంతసేపటికీ పాలు పొంగలేదు. కొద్ది సేపయ్యాక పాలు పొంగబోతున్నట్లు ఊరించింది కానీ పొంగలేదు. ఇంతలో ఊర్లోని బడి గంట 'గణ గణ' మని మోగింది. 'అయ్యో, టైం అవుతోందే...' అని గాబరాపడ్డాడు. కొద్దిసేపటికి పాలు పొంగాయి. ఒక్క చుక్క పొయ్యిలో పడకుండా దింపేశాడు. బడికి పోతూ ఆలోచించాడు. 'అమ్మ, పొయ్యి మీద పాలు పెట్టి వేరే పనుల్లో తల మునకలై ఉంటే ఇబ్బంది కదా' అని ఆలోచించాడు. బడికి వెళ్ళాక తరగతి గదిలోనూ ఆలోచించాడు. మిత్రులతో మాట్లాడాడు. వాళ్ళు 'పెద్ద సైంటిస్టు బయలు దేరాడురబ్బా' అంటూ ఎగతాళి చేశారు. వారితో ఈ విషయం మాట్లాడటం వృథా అనిపించింది. మౌనంగా వరండాలో నడుస్తూ ఉంటే నోటీసు బోర్డులోని ఒక సర్క్యులర్ దీపక్‌ని ఆకర్షించింది. వారం తర్వాత తిరుపతి పట్టణంలో సైన్సు ఎగ్జిబిషన్ జరగబోతుందని ఆ సర్క్యులర్‌లో ఉంది. తియ్యటి పాల మీగడ తిన్నంత ఆనందపడినాడు దీపక్.

ఇంటర్వెల్ సమయంలో సైన్సు అయ్యవారిని కలిశాడు. ఎవరైనా ప్రయోగాలు చేసి తీసుకువస్తే తిరుపతి ఎగ్జిబిషన్‌కి తీసుకెళ్తానని సైన్సు అయ్యవారు చెప్పారు. తను చేయదలుచుకున్న పరికరం గురించి చెప్పాడు. అంతా ఓపికగా విన్న సైన్సు అయ్యవారు 'సూపర్' అన్నాడు. అయ్యవారి సలహాలు తీసుకున్నాడు. డబ్బు ఎంత అవుతుందో లెక్క వ్రాసి చూసుకున్నాడు.

బడి వదిలిందే ఇంటికి గబగబా వెళ్ళాడు. అమ్మను డబ్బు అడిగాడు. ఎందుకని ప్రశ్నించింది. నువ్వు వేరే పనుల్లో ఉన్నప్పుడు పాలు పొంగి పొయ్యిలోకి పోకుండా మిల్క్ ఓవర్ ఫ్లో డిటెక్టర్ (ఎంఓడి) తయారు చేస్తున్నానని చెప్పాడు. తన మేలు కోరే కొడుకు పుట్టినందులకు పరవశించి పోయింది అమ్మ. చకచకా వెళ్ళి ట్రంకు పెట్టెలోని పదిహేను వందల డబ్బు దీపక్ చేతికి ఇచ్చింది. ఈ ప్రాజెక్టులో ఇన్ఫ్రా రెడ్ రేడియేషన్ (ఐ ఆర్) సెన్సార్లను ఉపయోగించాడు. ఆ పరికరాన్ని గాస్ స్టవ్ ఆన్/ఆఫ్ చేసే నాబ్‌కి అనుసంధానం చేశాడు. పాలు పొంగే సమయంలో ఐ.ఆర్ సెన్సార్ల ద్వారా ఎంఓడి గుర్తిస్తుంది. వెంటనే ఆర్డు యూనో యూఎన్ఓ సర్క్యూట్‌కి సమాచారం చేరుతుంది. 'టింగ్ టింగ్' మని బజర్ మోగుతూ మనల్ని అప్రమత్తం చేస్తుంది. కనురెప్పలు మూసి తెరిచేలోగా మోటార్ ద్వారా గ్యాస్ నాబ్‌ని ఆఫ్ చేస్తుంది. పాలు పొంగడం ఆగిపోతుంది. ఈ మొత్తం పరికరం ఒక పవర్ బ్యాంకు నుంచి వచ్చే విద్యుత్తు ద్వారా పని చేస్తుంది.

దీపక్ దాన్ని భద్రంగా తిరుపతి ఎగ్జిబిషన్‌కి తీసుకెళ్ళాడు. అక్కడ ప్రథమ బహుమతి పొందాడు. కలెక్టరు చేతుల గుండా అమ్మతో కలిసి బహుమతి అందుకున్నాడు. మరుసటి రోజు పత్రికల్లో వచ్చిన ఫోటో న్యూస్ చదివి ఊర్లోవాళ్ళు అభినందనలు తెలిపారు. దాంతో సైన్సులో మరిన్ని ప్రయోగాలు చేయాలని నిర్ణయించుకున్నాడు దీపక్.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు
m : 9393662821



# శిలీంధ్రాలు లేకుండా భూమిని ఊహించగలమా?

ప్రపంచ జీవవైవిధ్య స్థితిపై అత్యంత విశ్వసనీయ సూచికగా భావించే IUCN రెడ్ లిస్ట్ తాజా నివేదిక భూమిపై జీవరాశులు ఎదుర్కొంటున్న ప్రమాదాల తీవ్రతను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ప్రస్తుతం రెడ్ లిస్ట్‌లో మొత్తం 1,69,420 జాతులు నమోదు చేయబడగా, వాటిలో 47,187 జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నట్లు ప్రకటించబడింది. ఇది మానవ చర్యల వల్ల ప్రకృతి వ్యవస్థలు ఎంత వేగంగా క్షీణిస్తున్నాయో స్పష్టంగా సూచిస్తోంది.

ఈ నివేదికలో శిలీంధ్రాలపై ప్రత్యేక దృష్టి సారించబడింది. తాజాగా అంచనా వేయబడిన 482 శిలీంధ్ర జాతులను చేర్చడంతో రెడ్ లిస్ట్‌లో శిలీంధ్రాల సంఖ్య 1,300కు చేరింది. వీటిలో కనీసం 411 జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. శిలీంధ్రాలు నేల ఆరోగ్యం, మొక్కల వృద్ధి, పోషక చక్రాలు, కార్బన్ నిల్వ వంటి కీలక పర్యావరణ వ్యవస్థ సేవలను అందిస్తాయి. అయినప్పటికీ, ఇవి ఇప్పటివరకు పరిరక్షణ చర్చల్లో తగిన ప్రాధాన్యం పొందలేకపోయాయి. వ్యవసాయ భూముల విస్తరణ, పట్టణీకరణ వేగంగా పెరగడం వల్ల శిలీంధ్రాల సహజ ఆవాసాలు నాశనం అవుతున్నాయి. ఈ కారణంగా 279 శిలీంధ్ర జాతులు ముప్పును ఎదుర్కొంటున్నాయి. అదనంగా, ఎరువుల వినియోగం వల్ల వెలువడే నత్రజని, అమ్మోనియా కాలుష్యం మరియు వాహనాల ఉద్గారాలు మరో 91 జాతులను ప్రమాదంలోకి నెట్టుతున్నాయి. ఈ సమస్య ఐరోపాలో మరింత తీవ్రమై, సంప్రదాయ గ్రామీణ ప్రాంతాల్లో కనిపించే అనేక శిలీంధ్ర జాతులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

అటవీ నిర్మూలన కూడా శిలీంధ్రాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కలప ఉత్పత్తి కోసం అడవులను నరికి వేయడం, చెట్ల తొలగింపు, వ్యవసాయం కోసం అడవులను క్లియర్ చేయడం వల్ల కనీసం 198 శిలీంధ్ర జాతులు ప్రమాదంలో పడ్డాయి. ముఖ్యంగా పాత-పెరిగిన అడవుల నాశనం శిలీంధ్రాలకు తీవ్రమైన దెబ్బగా మారుతోంది. ఈ అడవులు తిరిగి ఏర్పడేలోపు అనేక అరుదైన శిలీంధ్రాలు పూర్తిగా కనుమరుగవుతున్నాయి.

వాతావరణ మార్పు ప్రభావం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అగ్నిప్రమాదాల తీవ్రత, తరచుదనం పెరగడం వల్ల USAలోనే 50కిపైగా శిలీంధ్ర జాతులు ప్రమాదంలోకి వచ్చాయి. అడవుల కూర్పు మారడంతో ప్రత్యేక ఆవాసాలపై ఆధారపడిన జాతులు నిలువలేకపోతున్నాయి. ఈ రెడ్ లిస్ట్ నివేదికలో మొక్కలు మరియు జంతువుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. యెమెన్‌లోని సోకోట్రా దీవిలో ఫ్రాంకిన్సెన్స్ (బోస్వెల్లియా) చెట్లు మేకల మేత, కరువులు, తుఫానుల వల్ల అంతరించిపోతున్నాయి. అలాగే సింహం వంటి ప్రతీకాత్మక జాతుల విషయంలో పరిరక్షణ చర్యలు కొంతవరకు ఫలితమిచ్చినా, వాటి భవిష్యత్తు ఇంకా సవాళ్లతోనే ఉంది. మొత్తంగా, IUCN రెడ్ లిస్ట్ తాజా హెచ్చరిక ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. జీవవైవిధ్య పరిరక్షణ ఇక ఆలస్యం చేయరాని బాధ్యత. పాత అడవుల రక్షణ, స్థిరమైన అటవీ నిర్వహణ, కాలుష్య నియంత్రణ మరియు స్థానిక సమాజాల చురుకైన భాగస్వామ్యం ద్వారా మాత్రమే ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడగలమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు

(IUCN రెడ్ లిస్ట్ నివేదిక, గ్లాండ్, స్విట్జర్లాండ్, 2025 (IUCN))

- సచిన్ కోత్వాల్
m : 97010 01036

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి గ్రంథాలయం

# బాలచెలిమి గ్రంథాలయాల ప్రారంభం

**ఇందారం**



చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ వారి బాలచెలమి గ్రంథాలయంను మంచిర్యాల జిల్లాలోని ఇందారంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గౌరవ మండల విద్యాధికారి బి. శ్రీనివాస్ గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గోపగాని రవీందర్ సమన్వయం చేశారు. గ్రంథాలయానికి పుస్తకాలను అందించిన బాలచెలమి మాసపత్రిక ఎడిటర్ శ్రీ వేద కుమార్ గారికి, అలాగే ఈ పాఠశాల ఎంపికకు సహకరించిన శ్రీ గరిపల్లి అశోక్ గారికి నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**జీనుగురాల పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయం ప్రారంభం**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం జీనుగురాల ప్రాథమికోన్నత పాఠశాలలో జనవరి 21న బాలచెలిమి గ్రంథాలయాన్ని మహబూబ్‌నగర్ జిల్లా ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి మాసపత్రిక, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా రూ. 7,000/- విలువ చేసే 108 పుస్తకాలను పాఠశాలకు అందించారు. ఈ గ్రంథాలలో పాలమూరు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రచించిన "మహబూబ్‌నగర్ జిల్లా బడిపిల్లల కథలు" అనే ప్రత్యేక పుస్తకం కూడా ఉంది. ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు కథలు, కవితలు వంటి సృజనాత్మక రచనలు చేయడానికి అలవాటు పడాలని సూచించారు. బాలచెలిమి పుస్తకాలలోని అంశాలు విద్యార్థులను ఆకర్షించేలా ఉన్నాయని ప్రశంసించారు.

మాసపత్రిక సంపాదకులు మణికొండ వేదకుమార్, బాల సాహిత్యవేత్త గరిపెల్లి అశోక్ గార్లకు బాలచెలిమి జిల్లా కోఆర్డినేటర్ డా. భీంపల్లి శ్రీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బలరామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. వేంకటేశ్వరాచారి, ఉపాధ్యాయులు వేంకటేశ్వరమ్మ, అశోక్ కుమార్, బాదేపల్లి విజయలక్ష్మి, పూదూరు నాగరాజు, డా. భీంపల్లి శ్రీకాంత్, విద్యాధర్ రెడ్డి, టి. విజయలక్ష్మి, బి. శోభిత, మండల ఎమ్మార్సీ సిబ్బంది శేఖర్ గౌడ్, రాధిక, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



## బాలచెలిమి గ్రంథాలయం ప్రారంభోత్సవం నిర్మల్ జిల్లా



నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని వెల్మల్-బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బాలచెలిమి గ్రంథాలయం ఘనంగా ప్రారంభమైంది. ఈ గ్రంథాలయాన్ని వెల్మల్ సర్పంచ్ రాచకొండ సాగర్ మరియు బొప్పారం సర్పంచ్ దేశెట్టి నరేష్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచకొండ సాగర్ మాట్లాడుతూ పుస్తకాలు మంచి మిత్రులతో సమానమని, ఇటువంటి ఉత్తమ పుస్తకాలను అందించిన బాలచెలిమి మాసపత్రిక సంపాదకులు మణికొండ వేద కుమార్ గారికి ధన్యవాదాలు తెలిపారు. దేశెట్టి నరేష్ మాట్లాడుతూ పిల్లలు రాసిన పుస్తకాలను పిల్లలే చదివితే మరింత ఉత్సాహంతో పఠనం చేస్తారని, బాలల సాహిత్య వికాసానికి బాలచెలిమి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.

ప్రధానోపాధ్యాయులు నాలం విద్యాసాగర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన 20 పాఠశాలల్లో తమ పాఠశాల ఒకటిగా ఉండటం గర్వకారణ మన్నారు. మొదటి విడతగా రూ.6,233 విలువైన 150 పుస్తకాలను అందించారని, వీటిని చదివించేందుకు ప్రతి తరగతికి వారానికి ఒక పిరియడ్ కేటాయిస్తామని తెలిపారు. గ్రంథాలయ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు కొండూరు పోతన్న మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రచించిన అంకురాలు-2 కథల సంపుటి రాష్ట్ర స్థాయి బాలసాహితీ వేత్తలకు చేరడం ఆనందకరమన్నారు. పిల్లలు రాసిన కథలు చదవడం ద్వారా ఇతర విద్యార్థుల్లో కూడా రచనా ప్రేరణ కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, సీనియర్ ఉపాధ్యాయులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలచెలిమి పుస్తకాల వితరణ - అశ్వారావుపేట జిల్లా



బాలచెలిమి చిల్డ్రన్స్ అకాడమి, హైదరాబాద్ వారు అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రంథాలయ నిర్వహణలో భాగంగా బాలసాహిత్యం పుస్తకాలను అందచేసారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాలచెలిమి తరపున ప్రముఖ సాహితీవేత్త సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.హరితగారికి అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో సాహితీ విలువలు పెంపొందించుటకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపకరిస్తాయని గ్రంథాలయ పిరియడ్‌లో వినియోగించి పిల్లలతో చదివిస్తామని అన్నారు. తమ పాఠశాలను ఎంపిక చేసి పుస్తకాలను అందించుటకు సహకరించిన ప్రభాకరాచార్యులు గారికి, గరిపెల్లి అశోక్ గారికి బాలచెలిమి నిర్వాహకులు మణికొండ వేదకుమార్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గ్రంథాలయ ఇంచార్జి పుల్లయ్య, ఉపాధ్యాయులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలచెలిమి గ్రంథాలయం ప్రారంభోత్సవం కేశవపట్నం



- బాలచెలిమి డెస్క్

## బాలచెలిమి సంచిక ఆవిష్కరణ



తిరుపతిలోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో జనవరి 2026 బాలచెలిమి సంచిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్ సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలచెలిమి సాహితీ వేత్తలు పి. తులసీనాయుడు, డా. వి.ఆర్. శర్మ, డా. కిట్టన్న, డా. గంగిశెట్టి శివకుమార్, కృష్ణస్వామి రాజు, యువశ్రీ మురళి, గద్వాల సోమన్న, గోవిందయ్య, నాగార్జున శర్మ, డా. నారాయణమూర్తి, డా. మౌని, శ్రీమతి పద్మ పాల్గొన్నారు. బాలసాహిత్యం పిల్లల మేధస్సు, సృజనాత్మకత అభివృద్ధికి దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. బాలచెలిమి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అభినందించారు.

## సృజనాత్మకతకు ప్రోత్సాహం - బాలసాహిత్యానికి ప్రాధాన్యం



బాలలలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలనే లక్ష్యంతో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా “బాలసాహిత్య కార్యశాలలు” ప్రారంభమయ్యాయి. 2026 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించగా, పద్మభూషణ్ డా. కె.ఐ. వరప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మక రచనాపట్ల ఆసక్తి పెంపొందించడం, భావి కవులు-రచయితలను తీర్చిదిద్దడం ఈ కార్యశాలల ప్రధాన ఉద్దేశ్యం. జిల్లా, డివిజన్ స్థాయిల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించే ప్రణాళిక రూపొందించారు. మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ బాలసాహిత్యం పిల్లల ఊహాశక్తికి రెక్కలు ఇస్తుందని తెలిపారు. సమన్వయకర్త గరిపెల్లి అశోక్, ప్రధాన కార్యదర్శి డా. జె. చెన్నయ్య సాహిత్యవేత్తలకు స్వాగతం పలికారు. కేంద్ర సాహిత్య అకాడమీ, కాళోజీ అవార్డు గ్రహీతలు మరియు పలువురు బాలసాహితీవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలుగు కథానికలకు వెలుగునిచ్చిన భూపతి చంద్ర స్మారక వేడుక-2026




ప్రదానోత్సవ సభ-2026 హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ కళా సారస్వత పరిషత్ వేదికగా ఘనంగా జరిగింది. సభకు అధ్యక్షత వహించిన భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎమ్.ఎల్. కాంతారావు మాట్లాడుతూ పూర్వ కవుల కథానికలు తనకు ఎంతో ఇష్టమని, కుటుంబరావు రచనలు, అలాగే కన్యాశుల్కం, రాజారాం గారి “వింత ప్రపంచం” వంటి కృతులు తనను ప్రభావితం చేశాయని తెలిపారు. మంచి కథలు సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి కలిగి ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సి. మృణాళిని మాట్లాడుతూ తెలుగు కథానికల్లో పరిశోధన, పరిశీలన పెరిగితే సరికొత్త కథలు పుడతాయని చెప్పారు. రచయితలు స్వీయ అనుభవాలకే పరిమితం కాకుండా విస్తృత దృష్టితో రచనలు చేయాలని సూచించారు. సమాజంలో సంస్కారం, అభిరుచి విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విశిష్ట అతిథి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీలు తెలుగు సాహిత్యంలో కొత్త అనవాయితీని తీసుకువచ్చాయని, సమాజాన్ని మేల్కొలిపే కథలు రావాలని సూచించారు. గౌరవ అతిథి మహమ్మద్ ఖదీర్ బాబు సమాజంలో పెరుగుతున్న కర్కశతను ప్రస్తావిస్తూ మానవీయ విలువల కథలు అవసరమన్నారు. ఆత్మీయ అతిథి బి. నరసింగరావు రచయితల ఊహాశక్తి కథాసృష్టికి ప్రాణమని తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతి సుంకోజ దేవేంద్రచారి, ద్వితీయ బహుమతి పొత్తూరి సీతారామరాజు, తృతీయ బహుమతి పుప్పాల కృష్ణమూర్తికి, ప్రోత్సాహక పురస్కారాలు డాక్టర్ ఎం. సుగుణ రావు, శ్రీ చొక్కర తాతారావు, శ్రీ మొయిద శ్రీనివాసరావు, శ్రీమతి ఉయ్యూరు అనసూయ, శ్రీ ఇంద్రగంటి మధుసూదన రావు గార్లకు అందజేశారు. కార్యక్రమం సి.ఎస్. రాంబాబు నిర్వహణలో విజయవంతంగా సాగింది.

**- బాలచెలిమి డెస్క్**

## ఆధునిక భారతీయ తాత్వికుడు, ఆలోచనాపరుడు

# జిడ్డు కృష్ణమూర్తి

జిడ్డు కృష్ణమూర్తి (1895-1986) ఆధునిక భారతదేశానికి చెందిన మహత్తర తాత్వికుడు, ఆలోచనాపరుడు, ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక చైతన్యానికి కొత్త దిశ చూపిన మహనీయుడు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో 1895 మే 11న జన్మించారు. చిన్ననాటి నుంచే అసాధారణమైన ప్రశాంత స్వభావం, లోతైన పరిశీలనా దృష్టి ఆయనలో కనిపించాయి. 1909లో అద్యార్ సమీపంలో ఆయనను చార్ల్స్ లీడ్‌బీటర్ గమనించి, అతనిలో అసాధారణ ఆధ్యాత్మిక సామర్థ్యం ఉందని భావించాడు. తరువాత థియోసాఫికల్ సొసైటీ నాయకురాలు అన్నీ బిసెంట్ ఆయనను తమ సంరక్షణలోకి తీసుకున్నారు.



థియోసాఫికల్ వర్గాలు కృష్ణమూర్తిని "ప్రపంచ గురువు"గా తీర్చి దిద్దాలని యత్నించాయి. ఇందుకోసం "ఆర్డర్ ఆఫ్ ద స్టార్" అనే సంస్థను కూడా స్థాపించారు. అయితే 1929లో నెదర్లాండ్స్‌లో జరిగిన సభలో కృష్ణమూర్తి ఆ సంస్థను స్వయంగా రద్దు చేస్తూ, "సత్యం ఒక మార్గరహిత భూమి" (Truth is a pathless land) అని ప్రకటించారు. ఏ మతం, ఏ గురువు, ఏ సంస్థ ద్వారా సత్యాన్ని పొంద లేమని, ప్రతి మనిషి తనలో తానుగా తెలుసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ఆయన స్వతంత్ర ఆలోచనా ధోరణికి నిదర్శనం.

కృష్ణమూర్తి తత్వశాస్త్రంలో ప్రధానంగా "స్వీయ అవగాహన" (Self-awareness), "మనస్సు విముక్తి" (Freedom of mind), "భయరహిత జీవనం" వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. మనిషి తన ఆలోచనలను, భావోద్వేగాలను నిశితంగా గమనిస్తేనే అంతర్గత స్వేచ్ఛ లభిస్తుందని ఆయన బోధించారు. భయం, అసూయ, ద్వేషం వంటి భావాలు మనస్సును బంధిస్తాయని, వాటిని అర్థం చేసుకోవడం ద్వారానే విముక్తి సాధ్యమని చెప్పారు. ఆయన బోధనలు సులభమైన భాషలో ఉన్నప్పటికీ లోతైన తాత్వికతను కలిగి ఉంటాయి.

ప్రపంచంలోని అనేక దేశాలలో ఆయన ఉపన్యాసాలు ఇచ్చారు. అమెరికా, ఇంగ్లాండ్, భారతదేశం, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో సంవత్సరాల తరబడి ప్రజలకు ఆత్మ పరిశీలనపై ప్రసంగించారు. విద్యా రంగంలో కూడా ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. పిల్లల్లో స్వేచ్ఛా భావం, సృజనాత్మకత పెంపొందాలని భావించి భారతదేశంలో రిషీవ్యాలీ, రాజఘాట్ వంటి ప్రదేశాల్లో పాఠశాలలను స్థాపించారు. ఈ పాఠశాలల్లో మార్కులకంటే మానవ విలువలకు ప్రాధాన్యం ఇచ్చారు.

కృష్ణమూర్తి రచనలు అనేక భాషల్లోకి అనువదించబడ్డాయి. "The First and Last Freedom", "Commentaries on Living" వంటి గ్రంథాలు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాయి. ఆయన జీవితం అంతా ఒకే సందేశాన్ని ప్రతిధ్వనించింది. మనిషి తనలోని బంధనాలను తెలుసుకుని, స్వయంగా విముక్తి పొందాలి. ఎవరినీ అనుసరించకుండా, స్వయంగా పరిశీలిస్తూ జీవించాలి.

1986 ఫిబ్రవరి 17న అమెరికాలో ఆయన పరమ పదించారు. అయినప్పటికీ ఆయన ఆలోచనలు నేటికీ ప్రాసంగికంగా నిలిచాయి. మానవ మనస్సు స్వరూపాన్ని లోతుగా అధ్యయనం చేసిన తాత్వికుడిగా జిడ్డు కృష్ణమూర్తి ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు.

– సువేగా

# CENTRAL BOOK SHOP


**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789


CBS Global Service

CENTRAL BOOK SHOP

ABIDS / AMEERPET




- **SCHOOL BOOKS**
- **GENERAL BOOKS**
- **STATIONARY & GIFTS**


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI,** Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026




## బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com